# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 286 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 06 డిసెంబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 286 06-12-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## రాష్ట్రపతి భవన్ వద్ద పుతిన్‌కు ఘన స్వాగతం



న్యూఢిల్లీ : రష్యా అధ్యక్షుడు పుతిన్ కు రాష్ట్రపతి భవన్ వద్ద ఘన స్వాగతం లభించింది. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ కలిసి పుతిన్‌కు సాదర స్వాగతం పలికారు. అనంతరం సైనికుల నుంచి పుతిన్ గౌరవ వందనాన్ని స్వీకరించారు.



# ఒత్తిళ్లున్నా ఆగదు

**ధన సరఫరా కొనసాగిస్తాం**

**వాణిజ్య చెల్లింపులకు ఇరు దేశాల కరెన్సీ**

**సంయుక్త పత్రికా సమావేశంలో పుతిన్ - ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు : మోడీ**


న్యూఢిల్లీ : అమెరికా వంటి దేశాల నుంచి ఒత్తిళ్లు ఎదురవుతున్నప్పటికీ భారత్ - రష్యా మధ్య ఇంధన సరఫరా కొనసాగుతుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. భారత్‌లో పర్యటిస్తున్న పుతిన్‌తో ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం హైదరాబాద్ హౌస్‌లో గంటకు పైగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ఉక్రెయిన్‌లో పరిస్థితి పైన, ఆర్థిక, రాజకీయ, వ్యూహాత్మక రంగాలలో సహకారం పైన చర్చించారు. అనంతరం మోడీతో కలిసి సంయుక్త విలేకరుల సమావేశంలో పుతిన్ మాట్లాడారు. పశ్చిమ దేశాల ఒత్తిళ్ల కారణంగా రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ కొంతకాలంగా తగ్గించుకుంటున్నప్పటికీ సరఫరాలను పెంచేందుకు త్వరలో చర్యలు చేపడతామని ఆయన చెప్పారు. గత సంవత్సరం ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయిలో 12 శాతం పెరిగిందని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌తో వాణిజ్య సహకారంతోపాటు రక్షణ సహకారాన్ని కూడా మరింత పెంచుకుంటామని తెలిపారు. రెండు దేశాలు చెల్లింపుల కోసం తమ జాతీయ కరెన్సీలను ఉపయోగించుకుంటున్నాయని,

మిగతా 2లో..



## 'కలలకు రెక్కలు' పథకంతో..

# విదేశీ విద్యకు సహకారం..





- పావలా వడ్డీకే విదేశీ విద్య రుణాలు
- త్వరలో స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్టనర్షిప్ సమ్మిట్
- మూడేళ్లల్లో ఆంధ్రప్రదేశ్ విద్యా విధానానికి దేశంలోనే గుర్తింపు దక్కాలి
- పిల్లల్లో నైపుణ్యాలను గుర్తించాలి... మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి
- ప్రైవేట్ కంటే ప్రభుత్వ స్కూళ్లల్లోని టీచర్లే బెస్ట్
- విద్యాశాఖను సమర్థవంతంగా నిర్వహిస్తోన్న మంత్రి లోకేష్‌కు అభినందనలు
- మెగా పేరెంట్ టీచర్ మీటింగ్-3.0 కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- భామిని ఏపీ మోడల్ స్కూలును పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించిన సీఎం చంద్రబాబు

పార్వతీపురం డిసెంబర్ 05, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) : విద్యార్థుల ఉన్నత విద్యకు, విదేశీ విద్యకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దీనికోసం 'కలలకు రెక్కలు' పథకాన్ని ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. విదేశీ విద్య కోసం ఎంత ఖర్చు అవుతుందో అంత మేర పావలా వడ్డీకే రుణం ఇప్పిస్తామని సీఎం ప్రకటించారు. ఉన్నత, విదేశీ విద్య అభ్యసించాలనే కోరికలు, ఆశలను విద్యార్థులు చంపుకోవాల్సిన అవసరం లేదన్నారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్-3.0 కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించారు. ఈ జిల్లాలోని

మిగతా 2లో..





## నేటి నుంచి లోకేష్ అమెరికా, కెనడా పర్యటన

అమరావతి, డిసెంబర్ 05, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరోసారి అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 6 (శనివారం) నుంచి 10వ తేదీ వరకు ఐదు రోజుల పాటు అమెరికా, కెనడా దేశాల్లో పర్యటించనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పర్యటించనున్నారని మంత్రి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 6న తొలిరోజు డల్లాస్‌లో తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొంటారని తెలిపింది. 8, 9 తేదీల్లో శాన్‌ఫ్రాన్సిస్కో వేదికగా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమవుతారని, 10న కెనడాలోని టోరంటోలో పర్యటిస్తారని పేర్కొంది. కూటమి

మిగతా 2లో..

## లోబల్ సమ్మిట్‌కు సీఎం చంద్రబాబును ఆహ్వానించిన తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి



**ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ**

**'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'కు హాజరుకావాలని ఆహ్వానం**

**డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో సదస్సు నిర్వహణ**

**దావోస్ సమ్మిట్ తరహాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడి**

హైదరాబాద్ డిసెంబర్ 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'కు హాజరు కావాల్సిందిగా చంద్రబాబును

మిగతా 2లో..

## ఆ ప్రమాదం తీవ్రంగా కలచివేసింది : వైఎస్.జగన్

అమరావతి, డిసెంబర్ 05, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



తాడేపల్లి : ఎంతో ఉన్నత భవిష్యత్తు ఉన్న విద్యార్థులు ప్రమాదంలో మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందని వైఎస్.జగన్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పల్నాడు ఘోర రోడ్డు ప్రమాదంపై వైసిపి అధినేత జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో విద్యార్థులు మరణించడం బాధాకరమన్న ఆయన.. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాదెండ్ల మండలం గణపవరం వద్ద బైపాస్ రహదారిపై గురువారం రాత్రి ఓ కారు కంటెయినర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అయ్యప్పమాలధారణ వేసిన ఐదుగురు బీటెక్ విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటనపై వైఎస్ జగన్ స్పందిస్తూ %ొ% ఎంతో ఉన్నత భవిష్యత్తు ఉన్న విద్యార్థులు ఇలా ప్రమాదంలో మరణించడం తీవ్రంగా కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.




## దేశానికి పనికొచ్చే శక్తులుగా విద్యార్థులను తయారు చేయాలి

- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య నిరంతర సమన్వయం అవసరం
- కేరళ తరహా విద్యావిధానం అమలు అవసరం
- రాష్ట్ర ఐ.టి., మానవ వనరుల శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ గారి చొరవతో చేపట్టిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు మంచి ఫలితాలు ఇస్తాయి
- జెన్ జీ కాలంలో విభిన్న రంగాల్లో సృజన అందరికీ అవసరం
- పుస్తకాలు చదవడం మనల్ని ఉన్నతంగా నిలబెడుతుంది... గ్రూప్ లైబ్రరీలు ఏర్పాటు కావాలి
- గంజాయి, మాదక ద్రవ్యాలు లేని సమాజాన్ని కలిసికట్టుగా నిర్మిద్దాం
- చిలకలూరిపేట శారదా జడ్పీ హైస్కూల్ లో నిర్వహించిన మెగా టీచర్స్ - పేరెంట్స్ మీటింగ్ లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్




పార్వతీపురం డిసెంబర్ 05, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) 'తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సుహృద్భావ సంబంధాలుండాలి. వారి మధ్య ఎంతటి మంచి వాతావరణం ఉంటే పిల్లల్లోనూ అట్లాంటి పాజిటివ్ దృక్పథం ఏర్పడుతుంది. జీవితంలో ఎదగాలంటే క్రమశిక్షణ అనేది ప్రతి ఒక్కరికీ అవసరం. మీ వ్యక్తిత్వం లేదా చదువు విషయాల్లో గురువులు ఒక దెబ్బ వేస్తే దాన్ని సీరియస్ గా తీసుకోవల్సిన అవసరం లేదు. అవి మనం ఆకాశమంత ఎదిగిన తర్వాత గురువు ఆశీర్వాదాలుగా గుర్తుండిపోతాయ'ని ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు చెప్పారు. పాఠశాలల్లోని విషయాలను కూడా రాజకీయం చేసేందుకు చాలా మంది సిద్ధంగా ఉన్నారని,

మిగతా 2లో..




## విజయవంతంగా ముగిసిన ఉద్భవ్-2025 వేడుకలు

- కేఎల్ యూనివర్శిటీలో మూడు రోజుల పాటు అట్టహాసంగా నిర్వహించిన ఉద్భవ్-2025
- దేశ వ్యాప్తంగా 22 రాష్ట్రాలనుండి వేడుకల్లో పాల్గొన్న 1500 మంది విద్యార్థులు
- వేడుకలలో భాగంగా సంప్రదాయ నాటిక, నృత్య, సంగీత పోటీలు
- 49 విభాగాలకు సంబంధించి పోటీల ఫలితాలు వెల్లడి మరియు విజేతలకు బహుమతుల ప్రధానం

విజయవాడ, డిసెంబర్ 05, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) గిరిజన విద్యార్థుల కళా నైపుణ్యాలను, ప్రతిభను వెలికితీసి దేశవ్యాప్తంగా చాటి చెప్పాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరవ జాతీయ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ సొసైటీ సంప్రదాయ మరియు సంస్కృతీ కళా ఉత్సవం ఉద్భవ్-2025 ఉత్సవాల ముగింపు వేడుకలను విజయవాడలోని లో కే ఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో కృష్ణ జింక ప్రధాన వేదికపై శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిధులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగులు

మిగతా 2లో..





# ఒత్తిళ్లున్నా ఆగదు

సుమారు 96 శాతం వాణిజ్య చెల్లింపులు జాతీయ కరెన్సీ (రూపీ-రూబుల్)ల్లో జరుగుతున్నాయని చెప్పారు. భవిష్యత్తులోనూ జాతీయ కరెన్సీల్లోనే వాణిజ్యాన్ని పెంపొందించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని ఇరువురు నేతలు తెలిపారు. 'భారత్‌లో అతి పెద్ద అణు విద్యుత్ ప్లాంటును నిర్మించడానికి ఒక ప్రధాన ప్రాజెక్టును చేపడుతున్నామని చెప్పారు. "ఆరు రియాక్టర్ యూనిట్లలో ఇప్పటికే రెండింటిని గ్రిడ్‌కు అనుసంధానించామని, ఈ ప్లాంటు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే భారత ఇంధన అవసరాలు తీరతాయి. పరిశ్రమలు, నివాస గృహాలకు చౌకగా విద్యుత్ లభిస్తుంది' అని పుతిన్ తెలిపారు. సైనిక సాంకేతిక రంగంలో రెండు దేశాలు సన్నిహిత సహకారాన్ని పెంచుకుంటున్నాయని ఇరు దేశాల నేతలు తెలిపారు. భారత సైనిక దళాల ఆధునీకరణకు గత అర్ధ శతాబ్ద కాలంగా రష్యా సహకరిస్తోందని అన్నారు. వచ్చే ఏడాది భారత్ బ్రిక్స్ సమావేశాలకు అధ్యక్షత వహించనుందని, భారతీయ స్నేహితులకు అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని అన్నారు. మోడీతో జరిపిన చర్చలు సంతృప్తిని కలిగించాయని పుతిన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

**ఉగ్రవాదంపై పోరులో కలిసి నడుస్తాం**

ఉగ్రవాదంపై పోరులో భారత్, రష్యా కలిసి నడుస్తాయని ప్రధాని మోడీ అన్నారు. శాంతి కోసం జరిపే ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రయత్నంలో తాము భుజం భుజం కలిపి నడుస్తామని చెప్పారు. ఇటీవల పహల్గాంలో జరిగిన దాడికి, గత సంవత్సరం రష్యా రాజధాని మాస్కోలోని క్రాకస్ సిటీ కాన్సర్ట్ హాలులో జరిగిన దాడికి మూల కారణం ఉగ్రవాదమేనని అన్నారు. మానవత్వ విలువలపై జరుగుతున్న ఈ ప్రత్యక్ష దాడులను ఎదుర్కొనేందుకు ఇరు దేశాలు ఏకమయ్యాయని అన్నారు. భారత్, రష్యా, అమెరికాతో పాటు జి-20, బ్రిక్స్ వేదికలు కూడా ఉగ్రవాదంపై పోరులో పరస్పరం సహకరించుకుంటున్నాయని మోడీ వివరించారు.

## 'కలలకు రెక్కలు' పథకంతో.. విదేశీ విద్యకు సహకారం



పాలకొండ నియోజకవర్గం, భామిని గ్రామంలో ఏపీ మోడల్ హైస్కూల్లో జరిగిన పీటీఎం 3.%ఉ% కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేరెంట్, టీచర్, విద్యార్థులతో సీఎం మాట్లాడారు. మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన వివిధ ల్యాబ్స్ ను పరిశీలించారు. అలాగే క్లిక్కర్ టూల్ ద్వారా విద్యార్థులకు ఎలాంటి బోధన చేస్తున్నారనే అంశాన్ని స్వయంగా పిల్లలతో కలిసి కూర్చుని చూశారు. ఈ సందర్భంగా భామిని ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ...'రాబోయే కాలంలో విద్యా వ్యవస్థలో ఎవ్వరూ ఊహించని ఫలితాలు వస్తాయి... దీనికి అందరూ సహకరించాలి. మూడేళ్లలో దేశంలోనే నెంబర్ వన్ చేసేలా ఆంధ్రా స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ తెస్తానని మంత్రి లోకేష్ చెప్పారు. పిల్లలను సానబెడితే అద్భుతాలు సాధిస్తారు. విద్యలో పిల్లల బలాబలాలు తెలుసుకునేందుకు... దానికి అనుగుణంగా విశ్లేషించుకుని స్కై, మౌంటెన్, స్టీమ్ అనే మూడు రకాలుగా వర్గీకరించారు. క్లిక్కర్ అనే విధానం పిల్లలను మరింత ఆసక్తిగా చదువుకునేలా చేస్తోంది. నేను అనుకున్నదానికంటే విద్యా విధానం మెరుగ్గా ఉంది. పిల్లలు కూడా వాటిని అందిపుచ్చుకుంటున్నారు. పరీక్షలు జరిగిన తర్వాత సమర్థత తెలుసుకోవడం కాకుండా... ఎప్పటికప్పుడు పిల్లల చదువును విశ్లేషించేలా క్లిక్కర్ బాగా పని చేస్తోంది. పిల్లలు మట్టిలో మాణిక్యాలు... సరైన గైడెన్స్ ఉంటే ఏదైనా సాధించగలరు. అంధ క్రికెట్ క్రీడాకారిణి కరుణ కుమారి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని అంధ మహిళల క్రికెట్ ప్రపంచ కప్ ను సాధించింది. విద్యా విధానానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది... నిరంతరం ఫీడ్ బ్యాక్ తీసుకుంటోంది. అందుకే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాం. అంతే కాకుండా... ఈ తరహా సమావేశాల్లో అందరూ పాల్గొంటున్నాం. పల్నాడులో మెగా పీటీఎంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. అలాగే ప్రజా ప్రతినిధిలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.'అని ముఖ్యమంత్రి చెప్పారు.

**కష్టంగా కాదు... ఇష్టంగా చదవండి**

'ఒకప్పుడు పిల్లలు భారం అనుకునేవారు... కానీ ఇప్పుడు పిల్లలే ఆస్తి, పిల్లలే శ్రీరామ రక్ష, పిల్లలే భవిష్యత్. మధ్యాహ్న భోజనం నుంచి స్టూడెంట్ కిట్స్ వరకు నాణ్యత పెంచాం. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, నాణ్యతతో అందిస్తున్నాం. స్టూడెంట్ కిట్లపై పార్టీ రంగులు, చిహ్నాలు, ఫొటోలు లేకుండా అందిస్తున్నాం. విలువలతో కూడిన సమాజాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో పని చేస్తున్నాం. దానికి సహకరించాలని చాగంటి కోటేశ్వరరావును కోరాం చాగంటి ప్రవచనాల ద్వారా విలువలను విద్యార్థులు చక్కగా అర్థం చేసుకుంటున్నారు. గతంలో టీచర్లకు చాలా యాప్ లు ఉండేవి. ఇప్పుడు అలాంటి ఇబ్బందులను తొలగించాం. శనివారం నో బ్యాగ్ డే... ఆడుతూ పాడుతూ విద్యార్థులకు నచ్చిన పని చేస్తున్నారు. 24 గంటలు రుద్దితే చదువు అబ్బదు.. ఇష్టంతో తక్కువ సమయం చదివినా రాణిస్తారు. చదువులో వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రతిభా అవార్డులు ఇస్తున్నాం. విద్యలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు క్లస్టర్ అప్రోచ్ ద్వారా ప్రయత్నిస్తున్నాం. ప్రపంచంలో ఉన్న బెస్ట్ లెర్నింగ్ విధానాలు అధ్యయనం చేస్తున్నాం. విదేశాలకు వెళ్లి టీచర్లు అధ్యయనం చేస్తున్నారు. టీచర్లను రిక్రూట్ చేయకుండా చదువు చెబితే అది బూటకమే అవుతుంది. ప్రభుత్వ టీచర్లను నియమించాం... చక్కటి చదువు చెప్పిస్తున్నాం. మెగా డీఎస్సీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ దాన్ని సమర్థంగా ఎదుర్కొని ఏడాదిలోనే ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశాం. ట్రాన్స్‌ఫర్లను పారదర్శకంగా నిర్వహించాం. పిల్లలకు అవసరమైన విద్యను అందిస్తాం... దాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. అలాగే సామాజిక బాధ్యతగా డ్రగ్స్ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టే బాధ్యత విద్యార్థులకూ ఉంది.' అని సీఎం సూచించారు.

**విద్యార్థులు... వినూత్న ఆలోచనలు**

'ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఒక టీచరుకు 18 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు. కానీ ప్రైవేట్ స్కూళ్లలో ఒక టీచరుకు 25 మంది పిల్లలు ఉన్నారు. అంటే ప్రభుత్వ స్కూళ్లే బెటర్ అని అర్థమవుతుంది. స్కూళ్లకు ఇంత మంది టీచర్లను రిక్రూట్ చేశాం... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని అందరూ కోరుకునే పరిస్థితి రావాలి. గతంలో టీచర్లను అవమానించారు... మద్యం షాపుల దగ్గర నిలబెట్టారు. టీచర్లను గౌరవించే బాధ్యత మాది... పిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లది. ఏపీ విద్యా రంగాన్ని దేశంలో నెంబర్ 1 చేయాలి. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసింది... మేం సరి చేస్తున్నాం. విద్యార్థులకు మాక్ అసెంబ్లీ నిర్వహించాం... పిల్లలు అదరగొట్టారు. వచ్చే ఏడాది జనవరిలో స్టూడెంట్ ఇన్నోవేటర్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహించాలని భావిస్తున్నాం. ఏడో తరగతి నుంచి వినూత్నంగా ఆలోచించాలి. గ్రూప్ గా... వ్యక్తిగతంగా ఇన్నోవేషన్స్ చేసేలా ఆలోచన చేయాలి. పాఠశాల స్థాయి నుంచి జిల్లా స్థాయిలో గుర్తిస్తాం. ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో జరిగే ఇన్నోవేటర్స్ పార్టనర్ షిప్ సదస్సుల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తాం. ఆ సదస్సుకు వివిధ ప్రముఖ కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తాం. పిల్లల ఆలోచనలు బాగుంటే వారి ప్రతిభను గుర్తించి రివార్డులు అందిస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లోనూ సోలార్ ప్యానెళ్లు పెట్టుకుని విద్యుత్ ఉత్పత్తి చేయాలి.'అని ముఖ్యమంత్రి సూచించారు.

**ఏపీలోని విద్యార్థుల బాధ్యత విద్యా శాఖ మంత్రిదే**

'మంత్రి లోకేష్ చదువుకునే రోజుల్లో ఎలా చదువుతున్నారనే విషయమన్నీ తెలుసుకునేందుకు నేను ఎప్పుడూ స్కూలుకు వెళ్లలేదు... లోకేష్ కు చదువు చెప్పే టీచర్లతో నేను ఎప్పుడూ మాట్లాడలేదు. అంతా లోకేష్ తల్లి భువనేశ్వరినే చూసుకునేవారు. కొన్ని అంశాల్లో లోకేష్‌కు ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ఇప్పించాం.. ఆ తర్వాత చక్కగా చదువుకున్నారు... ఇప్పుడు మంత్రి అయ్యారు. రాజకీయాల్లోకి రమ్మని లోకేష్ ను నేను ఫోర్స్ చేయలేదు. వ్యాపారం చేసుకుంటే ఉంటే వ్యాపారమే చేసుకోవాలని కూడా సూచించాను. కానీ లోకేష్ రాజకీయాల్లోకి ఇష్టంతో వచ్చారు. విద్యా శాఖ చాలా కష్టంగా ఉంటుందని చెప్పినా... విద్యా విధానాన్ని తీర్చిదిద్దేలా పని చేస్తానని లోకేష్ చెప్పారు. దానికి అనుగుణంగానే విద్యాశాఖను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు మంత్రి లోకేష్‌ను అభినందిస్తున్నా. భువనేశ్వరి లోకేష్ ను స్టాన్ ఫోర్డ్ వరకు తీసుకెళ్లారు... ఇప్పుడు రాష్ట్ర విద్యార్థులను కూడా ఆ స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత విద్యా శాఖ మంత్రి లోకేష్ దే.'అని ముఖ్యమంత్రి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అమలు అవుతున్న ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలన్నీ పాటించాలని ముఖ్యమంత్రి సూచించారు. సభ అనంతరం విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేష్, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సహా విద్యా శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

## నేటి నుంచి లోకేష్ అమెరికా, కెనడా పర్యటన

ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేష్ అమెరికాలో పర్యటించడం ఇది రెండోసారి అని తెలిపింది. పెట్టుబడుల సాధన కోసం 18 నెలల్లో లోకేష్ అమెరికా, దావోస్, సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో పర్యటించారని పేర్కొంది.

## దేశానికి పనికొచ్చే శక్తులుగా

## విద్యార్థులను తయారు చేయాలి

ఇటీవల పిఠాపురంలో జరిగిన చిన్న సంఘటనకు రాజకీయ రంగు పులిమి చిన్నారులను దానిలోకి లాగే ప్రయత్నం చేశారని తెలిపారు. ఇలాంటి వారి పట్ల పెద్దలు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వేలాది ఎకరాలను కొల్లగొట్టే ఘనులు ఉన్న సమాజంలో పిల్లలకు ఆడుకోవడానికి పాఠశాలల్లో ఆటస్థలాలు లేకపోవడం విచారకరమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాల్లో భాగంగా చిలకలూరిపేట శారదా జడ్పీ హైస్కూలులో శ్రీ పవన్ కళ్యాణ్ గారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ... "నేటి రోజుల్లో విభిన్న సృజన అనేది ప్రతి విద్యార్థికి అవసరం. గురువులు కూడా కేవలం విద్యార్థులను జీతగాళ్లుగా తయారు చేసే పద్ధతికి స్వస్తి చెప్పి, దేశానికి పనికొచ్చేలా తీర్చిదిద్దాలి. పిల్లల్లోని సృజనను గుర్తించి వారిని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలి. కేరళ తరహాలో విద్యార్థి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య నిరంతరం సమన్వయం చేసుకునేలా ముందుకు సాగాలి. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ గారు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ వల్ల విద్యార్థుల భవిష్యత్తు మీద అందరికీ అవగాహన ఏర్పడుతుంది. విద్యార్థి బలాలు, బలహీనతలు తెలుస్తాయి. వాటిని ఎలా ఉపయోగించుకోవాలి.. ఎలా అధిగమించాలో ఇటు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలుస్తుంది. దీనివల్ల మంచి ఫలితాలు వస్తాయి. గురువును దైవంగా భావించే సంస్కృతి మనది. గురువులు కేవలం పాఠాలే కాదు జీవితాలు చెబుతారు. వారి మార్గదర్శకంలో మనం ఎంతో ఎదుగుతాం. నాకు చిన్నప్పుడు సోషల్ టీచర్ చెప్పిన దేశభక్తి పాఠాలు, గొప్ప నాయకుల చరిత్రలు నన్ను ఎంతో ఆలోచింపజేశాయి. ఈనాడు మీ ముందు ఇలా ఉన్నానంటే గురువులు చెప్పిన పాఠాలే ప్రధాన కారణం.

ఎ ఉన్న స్థలాలు దోచుకుపోయేవారు ఎక్కువయ్యారు గతంలో పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించేవారు. ఐఏఎస్ శ్రీ కృష్ణతేజ గారి తాతగారు శ్రీ మైలవరపు గుండయ్య గారు వందల ఎకరాల భూమిని ప్రజాహితం కోసం దానం చేశారు. శ్రీ మైలవరపు గుండయ్య పేరు మీద ఒక చౌక్ ఉంది అంటే ఎంత దానశీలి అనేది తెలుస్తుంది. ఇక్కడి స్కూల్ కి శ్రీ తోట చంద్రయ్య గారు స్థలం దానం చేశారని అధికారులు తెలిపారు. విద్యార్థులకు, మనకు అలాంటి పెద్దల దీవెనలు ఉండాలి. అయితే నేటి రోజుల్లో అలాంటి పరిస్థితి లేదు. ఉన్న స్థలాలను దోచుకుపోయేవారు ఎక్కువయ్యారు. ఇటీవల నేను మైసూరవారిపల్లె వెళ్లినపుడు అక్కడున్న పాఠశాలకు ఆట స్థలం లేదు అని తెలిసి, స్వయంగా నేను కొనుగోలు చేసి ఇచ్చాను.

**లైబ్రరీ నిండుగా పుస్తకాలు.. 25 కంప్యూటర్లు అందిస్తాను**

ఇప్పుడు కూడా శారద పాఠశాలకు సందర్శించినపుడు గ్రంథాలయంలో తగినన్ని పుస్తకాలు లేవని అర్థమైంది. పాఠశాలకు విభిన్నమైన పుస్తకాలతోపాటు వాటిని భద్రపరుచుకునేందుకు బీరువాలను అందజేస్తాను. ఇక్కడ లైబ్రరీ నిండుగా తెలుగు, ఇంగ్లీష్, హిందీ పుస్తకాలు ఇస్తాను. అలాగే 25 కంప్యూటర్లను పాఠశాలకు ఇస్తాను. ఆట స్థలం కోసం అధికారులు స్థలం కోసం ప్రణాళిక సిద్ధం చేయాలి.

**చదువుతోనే అద్భుతాలు జరుగుతాయి**

చదువు అనేదే సమాజంలో ఉన్నతంగా నిలబెడుతుంది. డబ్బు, వస్తువులు మన దగ్గర నుంచి వెళ్లిపోవచ్చు. చదువు మాత్రం ఎప్పుడు మన దగ్గర ఉండే శక్తి. సృజనాత్మక, శాస్త్రీయమైన చదువు ద్వారా అద్భుతాలను ఆవిష్కరించొచ్చు. కేవలం పాఠ్యపుస్తకాలే కాదు వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, మహనీయుల చరిత్రలు, ఇతర పుస్తకాలను చదవడం ద్వారా ఉన్నతంగా ఎదగొచ్చు. జీవితాన్ని అద్భుతంగా మలుచుకోవచ్చు. దీన్ని గురువులు, తల్లిదండ్రులు కూడా గుర్తుంచుకొని పిల్లలను ప్రోత్సహించాలి. గ్రూప్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలి. వాటి ద్వారా పిల్లల్లో చదివే అలవాటు పెంచాలి. పిల్లలు ఉదయించే సూర్యులు. ఉత్తేజాన్ని నింపే సమాజాన్ని ఏర్పాటు చేయాలి. గురువులు ఒక్కోసారి అలసిపోవచ్చు. గురువుతో తినే చిన్న దెబ్బలే జీవితంలో మనకు గుర్తుండిపోతాయి.

**మార్కుల కోసం కాదు... భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని చదవండి**

జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే వినూత్నమైన ఆలోచనలు, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని చదవాలి. తమిళనాడు రాష్ట్రం రామేశ్వరంలో పుట్టిన డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం 'మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ఎదిగారు. నేడు భారతదేశ రక్షణ క్షిపణి వ్యవస్థకు ఒక మూలస్తంభంగా మారారు. ఆయన చదువుకున్నది ఇంగ్లీష్ మీడియంలో కాదు... తమిళ మీడియంలో. మార్కులు కోసం కాకుండా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని చదివితే ఇలాంటివి అద్భుతాలు సాధించవచ్చు.

**పిల్లలను బాధ్యత గల వ్యక్తులుగా తీర్చిదిద్దండి**

ఉపాధ్యాయులకు కూడా నా విన్నపం... దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను తీర్చిదిద్దాలి. రేపటి సమాజం కోసం వారిని తయారు చేయాలి. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావుల చరిత్ర గురించి మా సోషల్ టీచర్ చెప్పిన పాఠాలు... నా గుండెల్లోకి బలంగా వెళ్ళాయి. ఆ పాఠాలే నాలో సామాజిక బాధ్యతను పెంచాయి. ఈ రోజు సమాజానికి ఇంత చేయగలుగుతున్నాం అంటే దానికి ఆనాడు పడిన బీజమే కారణం. ప్రతి విద్యార్థిలో నిగూఢంగా అద్భుతమైన శక్తి దాగి ఉంటుంది. దానిని తల్లిదండ్రులు నిశితంగా గమనించాలి. పిల్లలు వారి లక్ష్యాలను చేరుకోవడానికి ప్రోత్సహించడం, వారికి మంచి విలువలు బోధించి సరైన మార్గం చూపించడం తల్లిదండ్రుల బాధ్యత. బూతులు తిట్టే వ్యక్తుల మాటలు వినవద్దు. వాటి కోసం టీవీలు చూడవద్దు. సినిమాల పిచ్చిలో వారిని పడకుండా చూడాలి. సినిమా అనేది వినోదంలో ఒక చిన్న భాగం మాత్రమే. వారికి మన శాస్త్రవేత్తల చరిత్ర, వారు సాధించిన విజయాలు, సమాజంలో గొప్ప గొప్ప వ్యక్తుల జీవితాలను పాఠాలుగా చెప్పి పెంచాలి. మీరు కూడా రేపు పెరిగి పెద్దయ్యాక వారిలా తయారవ్వాలని ప్రోత్సహించాలి. విద్యార్థుల ఆలోచన, ప్రవర్తన, వ్యక్తిత్వమే మన దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని గుర్తించుకొని పిల్లలను పెంచాలి.

**గంజాయి, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపండి**

సమాజంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది. గంజాయి ప్రమాదం కాదు అని కొందరు మాట్లాడే స్థితికి వచ్చారంటే ... సమాజం ఎంత ప్రమాదకర స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వ హయాంలో గంజాయిని రకరకాల పద్ధతుల్లో విస్తృతంగా వ్యాపించజేశారు. గంజాయిని చాక్లెట్లు, బిస్కెట్ల రూపంలోనూ వ్యాప్తం చేశారు. దానిపై ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల నడవడికపై ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు దృష్టిసారించాలి. గంజాయి, మాదకద్రవ్యాల బారినపడితే విద్యార్థులు భవిష్యత్తును కోల్పోతారు. కూటమి ప్రభుత్వం గంజాయి నిరోధంపై సీరియస్ గా దృష్టికి పెట్టింది. దీనికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలి. జ్ఞానం అనేది ఉన్నతమైనది, విస్తృతమైనది. దాని కోసం నిరంతరం విద్యార్థులు సాధన చేయాలి" అన్నారు. ఈ సమావేశంలో చిలకలూరుపేట శాసనసభ్యులు శ్రీ పత్తిపాటి పుల్లారావు, గుంటూరు జడ్పీ చైర్ పర్సన్ శ్రీమతి కత్తెర క్రిస్టినా, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా శాఖ డైరెక్టర్ శ్రీ పి. రంజిత్ బాషా, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శ్రీ కృష్ణతేజ, పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతిక శుక్లా, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీమతి రత్నజ్యోతి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులతో ఉప ముఖ్యమంత్రి మమేకం**

చిలకలూరిపేట స్థానిక శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మూడో మెగా పేరెంట్ %-% టీచర్ మీటింగ్ లో ముఖ్య అతిథిగా పాల్గొనడానికి వచ్చిన శ్రీ పవన్ కళ్యాణ్ గారువిద్యార్థులతో మమేకమయ్యారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించారు. స్కూల్ లైబ్రరీని పరిశీలించి విద్యార్థులకు అందుబాటులో ఉంచిన పుస్తకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తయారుచేసిన సైన్స్ పరికరాలు, హ్యాండీక్రాఫ్ట్స్ చూసి మురిసిపోయారు. ఆటల్లో ప్రతిభ కనబరిచిన వారిని అభినందించారు. తరగతి గదిలో విద్యార్థులతో కలిసి బెంచ్ మీద కూర్చొని వారితో కాసేపు ముచ్చటించారు.

**హెూలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు పరిశీలన**

కూటమి ప్రభుత్వం ప్రయోగాత్మకంగా తీసుకొచ్చిన హెూలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డును విద్యా శాఖ అధికారులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి చూపించారు. విద్యాభివృద్ధి, సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ సమతుల్యత, మేధో సామర్థ్యాలు, సైన్స్ ప్రయోగాల పరిస్థితి, ఆటల్లో రాణింపు తదితర కోణాల్లో పిల్లల సమగ్ర వికాసానికి సంబంధించిన అంశాలను ఇందులో నమోదు చేస్తున్నట్లు వివరించారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రతి విద్యార్థి దగ్గరకు వెళ్లి వాళ్ల రిపోర్టు పరిశీలించి అభినందించారు.

# లోబల్ సమ్మిట్‌కు సీఎం చంద్రబాబును ఆహ్వానించిన తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి

ఆయన ఆహ్వానించారు. శుక్రవారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ వేదికగా ఈ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఈ సదస్సును ప్రపంచ ప్రఖ్యాత దావోస్ సదస్సు తరహాలో నిర్వహిస్తున్నామని చంద్రబాబుకు వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా పలు ప్రముఖ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం తరఫున అధికారికంగా ఆహ్వానాన్ని అందించిన కోమటిరెడ్డి, సమ్మిట్ ప్రాధాన్యతను ముఖ్యమంత్రికి తెలియజేశారు.

## విజయవంతంగా ముగిసిన ఉద్భవ్-2025 వేడుకలు

సీనియర్ సిటిజన్ సంక్షేమం, సచివాలయం & గ్రామ వాలంటీర్ శాఖ మంత్రి, శ్రీ డోలా బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర పర్యాటక, సంస్కృతి మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కందుల దుర్గేష్ మరియు రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ గుమ్మిడి సంధ్యారాణి హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగులు మరియు సీనియర్ సిటిజన్ సంక్షేమం, సచివాలయం & గ్రామ వాలంటీర్ శాఖ మంత్రి, శ్రీ డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ......ఈ ఆరవ జాతీయ కళా ఉత్సవ్ ఉద్భవ్-2025 కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇవ్వడం చాలా గర్వంగా ఉందన్నారు. ఈ వేడుకలకు 22 రాష్ట్రాల నుండి విద్యార్థులు హాజరవడం జాతీయ సమగ్రతకు మరియు ఐక్యతకు నిదర్శనమన్నారు. అంతే కాకుండా మన దేశం యొక్క వైవిధ్యభరితమైన సంస్కృతి మరియు సంప్రదాయాలు, అభిప్రాయాలు మరియు ఆలోచనలు, ఒకరికొకరు పరస్పరం మార్చుకోవడానికి, అవలంభించాడనికి ఉద్భవ్-2025 వేడుక ఒక వేదిక అవుతుందన్నారు. అంతే కాకుండా మన దేశం అన్ని రంగాల్లో వేగంగా ముందుకు సాగుంతుందని, ఇలాంటి వేడుకలు భవిష్యత్తు తరాలకు ఒక మార్గదర్శిగా ఉంటుందని పేర్కొన్నారు. దేశం ఎలా అయితే వేగంగా అభివృద్ధి చెందుతుందో, ఆంధ్ర ప్రదేశ్ కూడా అంతే వేగంగా అభివృద్ధి చెడుతున్నదని, ఇందులో భాగంగానే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గిన్నీస్ బుక్ లో నమోదు అయ్యే రీతిలో నిర్వహించమని, అరకు కాఫీ కి ప్రపంచ స్థాయి గుర్తింపు లభించిందని తెలిపారు.

ఉద్భవ్-2025 ఉత్సవాలు దేశం నలుమూలల్లోని గిరిజనుల యొక్క సంప్రదాయాలు, సంస్కృతులను కలిపి ఒకే చోట ప్రతిబింభించే కార్యక్రమమని, ఈ పండుగకు భారతీయ కుటుంబం కలిసి వస్తుందన్నారు. ఉత్సవ్ అంటే మన మూలం మరియు మన దేశానికి ఒక అందమైన నిర్వచనమన్నారు. ఈ ఉద్భవ్-2025 లో భాగంగా 35 ఈవెంట్ లలో దాదాపు 1500 విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు అద్భుతమని, గెలుపు, పథకాలతో సంబంధం లేకుండా ఈ వేడుకలను, కరతాళ ధ్వనిని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని, ఈ వేడుకల ద్వారా లభించిన విశ్వాసాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. వేదిక పైన నిలబడినపుడే మీరు విజేతలయ్యారని అంతే కాకుండా మిరే గిరిజన భారతదేశానికి భవిష్యత్ నాయకులని విద్యార్థులని ఉద్దేశించి మాట్లాడారు. గిరిజన పిల్లలకు నాణ్యమైన విద్య, మంచి బోధన మరియు సమాన అవకాశాలను కల్పిస్తే వారు చరిత్రను సృష్టించగలరని నిరూపించారన్నారు. విద్యార్థులు కష్టపడి చదవి వైద్యులు, ఇంజనీర్లు, కళాకారులు మరియు వాస్తుశిల్పుల అవ్వాలనే తమ కళలను సాకారం చేసుకోవాలని యువ భారతం మీకోసం ఎదురుచూస్తుందని, భారత దేశపు భవిష్యత్తుకు పునాది విద్యార్థులేనని, ఈ కార్యక్రమంలో తాను భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన సంక్షేమం, మహిళాభివృద్ధి శాఖల మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి మాట్లాడుతూ...ఉద్భవ్ మహోత్సవానికి విచ్చేసి కార్యక్రమాన్ని ఆశీర్వదించిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రివర్యులు కందుల దుర్గేష్ కు మనందరికీ ఎంతో ఇష్టమైన విశిష్ట అతిథి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి లకు హృదయపూర్వక నమస్కారాలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి 22 రాష్ట్రాల నుండి 405 ఈఎం ఆర్ఎస్ స్కూళ్లకు చెందిన 1800 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొనడం ఎంతో ఆనందాన్నిచ్చిందని మంత్రి పేర్కొన్నారు. వేరు వేరు ప్రాంతాలు, భాషలు, సంస్కృతులు ఉన్నా.. మనందరం భారతీయులమే, మనం ఆదివాసీలమే అన్న భావనతో అందరూ ఐకమత్యంగా పాల్గొనడం అభినందనీయం అన్నారు. అనేక రంగాల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ అసాధారణమని చెబుతూ, ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన 110 మంది విద్యార్థుల్లో కొందరు 108 సార్లు సూర్యనమస్కారాలు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నిలిచిన విశాఖ యోగా చాంపియన్స్‌పై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు.

ప్రపంచవ్యాప్తంగా పేరుపొందిన అరకు కాఫీని పండిస్తున్న గిరిజన రైతుల కృషిని గుర్తుచేసి, ఆ కాఫీని దేశ విదేశాల్లో ప్రమోట్ చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల కృషి అభినందనీయమన్నారు. గిరిజన కళా సంపద, సంప్రదాయాలు, ప్రతిభను ప్రతిబింబించే నాటికలు, ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయని తెలిపారు. చదువుతో పాటు కళలు, క్రీడల్లోనూ గిరిజన విద్యార్థులు రాణించడం అభినందనీయం అన్నారు. స్వాతంత్ర్యోద్యమం లో గిరిజన హక్కుల కోసం పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు ను మరువలేమన్నారు.. బిర్సా ముండా వంటి గిరిజన ఉద్యమ నాయకులను స్మరిస్తూ వారి త్యాగాలు, విలువలు ఎప్పటికీ మార్గదర్శకంగా ఉండాలని ఆయన విగ్రహాన్ని పెట్టుకున్నామన్నారు..

తదుపరి రోజుల్లోనూ ఇలాంటి సాంస్కృతికోత్సవాల ద్వారా గిరిజన విద్యార్థులలోని కళా నైపుణ్యాలను వెలికితీసి, వారికి ఉన్నత స్థాయి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. మూడు రోజుల మహోత్సవం నిర్వహణలో ఏవైనా లోపాలు ఉన్నట్లయితే క్షమించమని, భవిష్యత్తులో మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తామని భరోసా ఇచ్చారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గిరిజన శాఖ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు, అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, ముఖ్యంగా దేశవ్యాప్తంగా 405 EMRS స్కూళ్ల నుండి పాల్గొన్న విద్యార్థులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఈ మహోత్సవాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ సుధా భార్గవి, గురుకులం సెక్రెటరీ గౌతమి లతోపాటు హాజరైన ఇతర ప్రముఖులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు

లికార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పర్యాటక, సంస్కృతి మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కందుల దుర్గేష్ మాట్లాడుతూ.లి ...

దేశవ్యాప్తంగా విద్యార్థులు తరలివచ్చి ప్రతిభ చూపడం అసాధారణ విషయమన్నారు. ఇటువంటి జాతీయ స్థాయి కార్యక్రమానికి ఏపీ వేదిక కావడం గర్వించే విషయమని అన్నారు. సరైన సదుపాయాలు లేని చోటు నుంచి సమగ్ర అభివృద్ధి సాధించడం సామాన్య విషయం కాదని వెల్లడించారు. అడవిలో పుట్టిపెరిగిన వారు సైతం అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ జాతీయ సాంస్కృతి, సాహిత్య మరియు కళా ఉత్సవ్ ఉద్భవ్-2025 వేడుకలు ఆంధ్రప్రదేశ్ లో విజయవంతంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇదొక అద్భుతమైన కార్యక్రమంగా అభివర్ణించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో ఇలాంటి గొప్పవేడుక విజయవంతంగా జరుపుకోవడం గర్వించదగ్గ అంశం అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన బిడ్డలకు ఇలాంటి సాంస్కృతిక పోటీలను నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వందలాది మంది బాలబాలికలు తమ అద్భుత ప్రతిభ పాటవాలతో దేశ సంస్కృతిని సాంప్రదాయాలను ఎలుగెత్తి చాటడం, దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన కళలను ఒకే వేదికపై చూడటానికి రెండు కళ్లు సరిపోలేదన్నారు.. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు.

భిన్న జాతులు, సంస్కృతులు కలిగిన సువిశాల భారత దేశంలో గిరి పుత్రుల ప్రతిభని ప్రపంచానికి పరిచయం చేసిన ఉద్భవ్ చరిత్రలో నిలుస్తుంది అన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి అభినందనలు తెలిపారు. గొప్ప ప్రదర్శనలకు చిరునామాగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్స్ స్కూల్స్ సాగుతుండటం గొప్ప విషయం అన్నారు. చదువుతోపాటు ఆల్ రౌండ్ పర్సనాలిటీ డెవలప్మెంట్ అందించడం సామాన్యమైన విషయం కాదన్నారు. గిరిజన బిడ్డలకు అత్యుత్తమమైన, నాణ్యమైన విద్యనందించడమే కాకుండా క్రీడలు, కళల్లోనూ మెరికల్లా తీర్చిదిద్దుతున్న అధ్యాపకులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. గిరిజన కళల గురించి, మన ఆచార, వ్యవహారాల గురించి దేశవ్యాప్తంగా మార్మోగేలా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఈ ఉద్భవ్-2025 ద్వారా గిరిజన విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు ఎక్కడో కొండకోనల్లో, అడవి తల్లి ఒడిలో నాగరిక సమాజానికి దూరంగా ఉండే అడవి బిడ్డల్లోని భయం, బిడియం పోగొట్టి వారిలో ఆత్మవిశ్వాసాన్ని, కళల్లో సత్తా చాటాలి అనే నమ్మకాన్ని ఈ కార్యక్రమం కలిగించింది అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఉద్భవ్ అంటే ఉద్భవించడం అని, గిరి పుత్రుల్లో కొత్త ప్రతిభను ఉద్భవింపజేసిన వేదికని అర్థం అన్నారు. గిరి పుత్రుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రోత్సహిస్తున్నాయి అన్నారు. తద్వారా ఎంతోమంది గిరిజన బిడ్డలు స్టార్లు, సూపర్ స్టార్లుగా ఎదుగుతున్నారన్నారు. మన గిరిజన కళలు ఎంతో ప్రాచీనమైనవని, ఇలాంటి కళలను పట్ల అభిరుచిని, వాటిని సంరక్షించి, భావి తరాలకు అందించాలన్న స్ఫూర్తిని పిల్లల్లో కలిగించే ప్రయత్నం ఈ ఉద్భవ్-2025 ద్వారా జరిగినందుకు సంతోషంగా ఉందని ఈ సందర్భంగా మంత్రి కందల దుర్గేష్ వెల్లడించారు.

రాష్ట్ర సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మల్లికార్జున్ నాయక్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న 740 ఈఎంఆర్ఎస్ లోని దాదాపు 1800 మంది విద్యార్థులు ఉద్భవ్ కళా వేడుకలలో పోటీ తత్వంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఉద్భవ్-2025కు ఆంధ్రప్రదేశ్ వేదిక కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. . ఉద్భవ్-2025ను విజయవంతం చేయడానికి కృషి చేసిన కేంద్ర ,రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ లోని ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలుపుతున్నామన్నారు.

ఎన్ ఈ ఎస్ టీ ఎస్ జాయింట్ కమిషనర్ బిపిన్ చంద్ర రాటురి మాట్లాడుతూ విద్యార్థులను సాంస్కృతిక సాహిత్యం కళారంగాల్లో గిరిజన విద్యార్థులను ప్రోత్సహించేందుకే ప్రతి సంవత్సరం ఈఎంఆర్ఎస్ కళా ఉత్సవాలను నిర్వహిస్తుమన్నారు. కేఎల్ యూనివర్సిటీలో 6వ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్.. జాతీయ సాంస్కృతి, సాహిత్య మరియు కళా ఉత్సవ్ ఉద్భవ్ -2025 వేడుకలు ఘనంగా, విజయవంతంగా జరిగాయన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన బిడ్డలకు ఇలాంటి సాంస్కృతిక పోటీలను నిర్వహించడం గొప్ప పరిణామం అని, మూడు రోజల పాటు 49 విభాగాల్లో దాదాపు వందలాది మంది బాలబాలికలు అద్భుత ప్రతిభ పాటవాలతో మన దేశ సంస్కృతిని సాంప్రదాయాలను ఎలుగెత్తి చాటారని కొనియాడారు. ఎన్నో స్థాయిలు దాటి పలు రాష్ట్రాల నుండి ప్రతిభ గల 558 స్టూడెంట్స్ పాల్గొన్నారని,137 మంది కమిటీ సభ్యులు పని చేసారన్నారు. మూడు రోజుల వేడుకల్లో గిరిజన సంస్కృతి ప్రతిబింబించిందని, అందరూ చురుకైన పాత్ర పోషించారన్నారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజ నేయ స్వామి, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ కు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమీ ఐఏఎస్ మాట్లాడుతూ ఉద్భవ్ వేడుకలలో గత మూడు రోజులుగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఈఎంఆర్ఎస్ విద్యార్థులు గిరిజన ప్రాంతాల సంస్కృతలను, కళారూపాలను అత్యద్భుతంగా ప్రదర్శించి ఇండియా హెరిటేజ్ ను ఆవిష్కరించారన్నారు. ఉద్భవ్-2025 వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యమివ్వడం మరచిపోలేని అనుభవం అని చెప్పారు. ఈఎంఆర్ఎస్ విద్యార్థుల కళా నైపుణ్యాలు ప్రతిభా పాటవాలను ప్రదర్శించడానికి ఉద్భవ్-2025 గొప్ప వేదిక అని వివరించారు. సంస్కృతి ఆత్మ..కళ అభినయం..సాహిత్యం మన ఆలోచన అని, దేశ సృజన, సంస్కృతి, ఐక్యతని ప్రపంచానికి చాటిన ఈ ఈవెంట్ హీరోలు ఈఎంఆర్ఎస్ విద్యార్థులే చెప్పారు. గెలవడం ముఖ్యం కాదని , .భాగస్వామ్యమవడమే గొప్ప అని పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలే అని తెలిపారు.గత మూడు రోజుల ఉత్సవాలను నిర్వహించడంలో కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థులదరూ ఇదే పోటీ తత్వం తో భవిష్యత్తులోను అన్ని వేదికలపై జరిగే కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మల్లికార్జున నాయక్ ఐఏఎస్, ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమీ ఐఏఎస్, నెస్ట్ సహాయ కార్యదర్శి బిపిన్ రాటురి, రంపచోడవరం ఐ టి డీ ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ స్మరన్ రాజ్, కేఎల్ యూనివర్సిటీ వీసీ ప్రో .వెంకట్రామన్, ఎస్టి కమిషన్ సభ్యులు మల్లేశ్వరరావు, కాకి లక్ష్మి , జిసిసి నెంబర్ కన్నమ రాజు, టిడిపి ఎస్టీ సెల్ చైర్మన్ ఎం ధారు నాయక్. ఎన్ ఈ ఎస్ టీ ఎస్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, వివిధ రాష్ట్రాలకు చెందిన ఈఎంఆర్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

అమలాపురం
డిసెంబర్ 06
శనివారం 2025



# రూపాయి ఘోర పతనం - పర్యవసానాలు

మన రూపాయి విలువ ఎన్నడూ లేనంతగా నేడు పతనమైంది. ఒక డాలర్‌కు 90 రూపాయలు చెల్లించాల్సిన స్థితికి విలువను కోల్పోయింది. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు డాలర్‌తో రూపాయి విలువ రూ. 62.33 ఉండగా.. ఈ గురువారానికి రూ. 90.37 పైసలకు పతనమైంది. ఒకవైపు దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) పెరిగి, ప్రపంచ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం దూసుకుపోతుందని కేంద్ర పాలకులు, వారి అనుచరగణం గగ్గోలు పెడుతుంటే, రూపాయి విలువ మాత్రం వేగంగా దిగజారిపోతున్నది. రూపాయి విలువ పతనంపై ఆర్థిక నిపుణులు, రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన ఎగుమతుల కంటే దిగుమతులు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ డిమాండ్ పెరగడంతో పాటు, మన దేశం నుండి మదుపుదారులు వైనాకు తమ డబ్బును తరలిస్తుండడం, దేశ ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోవడం, మోడీ ప్రభుత్వం అమెరికాతో జరుపుతున్న వాణిజ్య చర్చలు ఇందుకు తక్షణ కారణాలుగా వీరు చెబుతున్నారు. వీటికి తోడు మన దేశ సంపన్నులు తమ సంపదను మన రూపాయలలో కాకుండా అమెరికన్ డాలర్లలో, బంగారంలో ఉంచుకోవడానికి ఎగబడుతున్న ధోరణి ఇటీవల బాగా పెరిగింది.

విదేశీ ఇన్వెస్టర్లు ఈ రెండు రోజుల్లో రూ. 4,335 కోట్ల షేర్లు అమ్మేశారు. 2025 జనవరి నుండి డిసెంబర్ 2వ తేదీ నాటికి 1.5 లక్షల కోట్ల విలువ చేసే షేర్లను అమ్మి సంపదను తరలించుకుపోయారు. విదేశాల నుండి మన దేశంలోకి బంగారం దిగుమతులు గత ఐదు నెలల్లో మూడు రెట్లు పెరిగాయి. ఇదే సమయంలో ట్రంప్ సుంకాల వల్ల అమెరికాకు మన ఎగుమతులు 28 శాతం పడిపోయాయి. రష్యాకు బదులు అమెరికా నుండి అధిక ధరకు చమురు దిగుమతి చేసుకోవడం పెరిగింది. సంపద సృష్టించేది సంపన్నులే అని నిత్యం జపించే పాలకులు నేడు రూపాయి పతనానికి కారణమవుతున్న ఈ సంపన్నుల గురించి మాట్లాడడంలేదు. ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువల కొట్టుకుంటుంటే ప్రధానమంత్రి మాత్రం ప్రధాని కార్యాలయం పేరు మార్పు, ప్రతిపక్షాలపై 'డ్రామా' విమర్శలు చేయడంలో బిజీగా వున్నారు. ఆయనను కీర్తించే వార్తాపత్రికలు, మీడియా సంస్థలు 'మరక కూడా మంచిదే' అన్నట్లుగా రూపాయి పతనం కూడా మంచిదే అని కథనాలు ఇచ్చే సాహసం చేస్తున్నాయి.

స్వంత కరెన్సీ అనేది ఆ దేశ సార్వభౌమత్వానికి ఒక ముఖ్యమైన కొలమానం. అన్ని దేశాలు తమ స్వంత కరెన్సీతో వివిధ దేశాలతో వ్యాపారాలు చేస్తాయి. ప్రపంచ మార్కెట్‌లో ఆయా దేశాలు చేసే సరుకుల ఎగుమతులు, దేశ అంతర్గత ఆర్థిక స్థిరత్వాన్ని బట్టి కరెన్సీ విలువ పెరగడం, తగ్గడం జరుగుతుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత స్థూలంగా అమెరికా డాలర్ ప్రపంచ కరెన్సీగా చెలామణిలోకి వచ్చింది. ఈ ఆధిపత్యాన్ని ఉపయోగించుకుని అనేక దశాబ్దాలుగా అమెరికా ప్రపంచంపై ఆర్థిక, సైనిక పెత్తనం చేయగలిగింది. ఈ పెత్తనాన్ని ప్రతిఘటించేందుకు అనేక దేశాలు ప్రయత్నిస్తూనే వున్నాయి. ఏమైనా ఇప్పటికీ అమెరికా డాలర్ పెద్దన్న స్థానంలోనే వుంది. అమెరికా అధ్యక్షుడు మన ప్రధానికి ప్రియమైన మిత్రుడు. వీరి మైత్రి కాలంలోనే మన రూపాయి పతనం మరింత తీవ్రమైంది. స్వతంత్రం వచ్చిన తొలి 25 సంవత్సరాల తర్వాత మన రూపాయి డాలర్‌తో ఐదున్నర రూపాయల విలువను కోల్పోగా, ట్రంప్ రెండవసారి అధికారంలోకి వచ్చిన కేవలం ఈ పది నెలల్లో సుమారు ఆరు రూపాయల విలువను కోల్పోయింది.

**ట్రంప్ ఒత్తిళ్ళకు లొంగుతున్న కేంద్ర పాలకులు**

గత కొన్ని సంవత్సరాలుగా అమెరికా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. పారిశ్రామిక ఉత్పత్తి తగ్గింది. డాలర్‌కు పోటీ పెరిగింది. ఉపాధి అవకాశాలు కోల్పోయిన అమెరికా యువత పెద్ద ఎత్తున నిరసనలు చేస్తున్నారు. రాజకీయ రంగంలో దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సంక్షోభం నుండి అమెరికా కంపెనీలు, వారి పెట్టుబడి బయటపడాలంటే ఇన్నేళ్ళుగా ప్రపంచానికి చెప్పిన సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలకు భిన్నమైన విధానాలను అమలు చేయాలి. అందుకు ట్రంప్‌ను ఎన్నుకున్నారు. ఆయన అసంతృప్తితో వున్న యువతను ఆకర్షించేందుకు అనేక హామీలు, ఆందోళనలను పక్కదారి పట్టించేందుకు జాతి విద్వేషాలను రెచ్చగొట్టే ప్రకటనలతో ఎన్నికల్లో గెలిచాడు. తమ డాలర్ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి, ఖర్చు లేకుండా సంపద పోగేసుకోవడానికి ప్రపంచంపై టారిఫ్ టెర్రరిజం ప్రకటించాడు. కరెన్సీ విలువను తగ్గించుకోవాలని వివిధ దేశాలపై ఒత్తిళ్లు తెస్తున్నాడు. తాను చెప్పినట్లుగా చమురును దిగుమతి చేసుకోవాలంటున్నాడు. అమెరికాలోని విదేశీ ఉద్యోగులను, వీసాదారులను రకరకాలుగా వేధిస్తున్నాడు. వారి నుండి అధిక ఫీజుల వసూళ్లకు సిద్ధమయ్యాడు. అనేక దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నాడు. వీటిని అనేక దేశాలు ప్రతిఘటిస్తున్నాయి. మన దేశ బిజెపి పాలకులు మాత్రం ట్రంప్ విధానాలకు లొంగిపోతున్నారు. మన వ్యవసాయ రంగంలోకి అమెరికా కంపెనీలకు ప్రవేశించేందుకు వాణిజ్య చర్చలు సాగిస్తున్నారు. చౌకగా రష్యా నుండి వస్తున్న చమురు దిగుమతులను నిలిపివేసారు. 'మేక్ ఇన్ ఇండియా', 'మేడ్ ఇన్ ఇండియా' నినాదాలు ఉత్పాదక రంగాన్ని అభివృద్ధి పరచకపోగా గత 19 నెలల కనిష్ట పతనానికి కారణమయ్యారు. బిల్లం వున్నపోటే ఈగలు వుంటాయన్నట్లుగా ఇక్కడ లాభపడిన దేశీయ సంపన్నులు తమ సంపదను తరలించుకపోవడమే కాకుండా పౌరసత్వాన్ని కూడా రద్దు చేసుకుని లాభాలు వచ్చే చోటికి వెళ్ళిపోతున్నారు. ఈ పరిణామాలన్నీ రూపాయి పతనానికి కారణాలయ్యాయి.

**ప్రజలపై పెరగనున్న భారాలు**

రూపాయి విలువ పడిపోతే మనం విదేశాల నుండి దిగుమతి చేసుకునే అన్ని సరుకుల ధరలు పెరిగిపోతాయి. మన దేశ అవసరాల్లో 80 శాతం ముడి చమురును విదేశాల నుండి డాలర్ రూపంలోనే కొనుగోలు చేస్తున్నాము. ఏటా సుమారు 170 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు మనకు విదేశాల నుండి దిగుమతి అవుతుంది. 2022-23లో అప్పటి రూపాయి విలువ రూ. 82.60 పైసల ప్రకారం ముడి చమురు దిగుమతి కోసం 12 లక్షల కోట్లు ఖర్చు అయ్యింది. ఇప్పుడు అంతే మొత్తం దిగుమతి చేసుకోవాలంటే సుమారు 2 లక్షల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. కోట్లమంది గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఖర్చు చేస్తున్న సుమారు 48 వేల కోట్లకు నాలుగు రెట్లు ఖర్చు చేయాలి. ఈ భారం పెట్రోలు, డీజిల్, గ్యాస్ ప్రత్యక్షంగా, పరోక్షంగా వినియోగిస్తున్న 140 కోట్ల మంది భారతీయులపై పడుతుంది. నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరుగుతాయి. కోట్లమంది ప్రజలకు పౌష్టికాహారం కాదుకదా కనీస ఆహారం కూడా అందుబాటులో వుండదు. అలాగే విదేశీ ముడిపదార్థాలపై ఆధారపడిన ఆటోమొబైల్, రసాయన పరిశ్రమలు ఎక్కువ డబ్బు చెల్లించి దిగుమతి చేసుకోవలసి వస్తుంది. పెరిగిన ఉత్పత్తి ఖర్చుకు తగ్గట్టుగా అమ్మకాలు వుండకపోవడంతో పరిశ్రమలు మూత పడతాయి. నిరుద్యోగం పెరుగుతుంది. మన ఎగుమతులు మరింతగా తగ్గి దిగుమతి ఖర్చులు పెరుగుతాయి. విదేశాలకు చెల్లించాల్సిన అప్పుల భారం పెరిగిపోతుంది. విదేశీ వాణిజ్య లోటును మరింతగా పెంచుతాయి. దీన్ని భర్తీ చేసుకోవడానికి షరతులతో కూడిన అప్పుల కోసం ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ దగ్గరకు క్యూ కట్టాల్సి వస్తుంది.

**రూపాయి బలపడాలంటే!**

విదేశీ, స్వదేశీ కార్పొరేట్ అనుకూల ప్రపంచీకరణ విధానాలను విడనాడాలి. దేశాభివృద్ధికి తోడ్పడే వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. దేశంలో అత్యధికమంది ఆధారపడిన వ్యవసాయ రంగం గత కొన్ని దశాబ్దాలుగా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించాలి. ఇటీవల అన్ని రకాల పంటలు గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధర ప్రకటించడమే కాకుండా అమలు చేసే బాధ్యత తీసుకోవాలి. ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వ పరిశ్రమల్లో ఉత్పత్తి చేసి సరసమైన ధరలకు రైతులకు అందుబాటులో వుంచాలి. సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. తద్వారా గ్రామీణ ప్రజల కొనుగోలుశక్తి పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరమైన పునాదిని ఏర్పాటు చేస్తుంది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అనేక రాయితీలు ఇచ్చి ఉత్పత్తులను పెంచడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విద్య, వైద్యంతో పాటు అనేక సేవా రంగాలను ప్రభుత్వం నిర్వహించాలి. కార్పొరేట్ కంపెనీలు, సంపన్నుల కోసం ట్రంప్ ముందు సాగిలపడుతున్న ప్రస్తుత పాలకులు ఈ విధానాలను అమలు చేయలేరు. కావున రూపాయి బలపడాలన్నా, విధానాలు మారాలన్నా పాలకులే మారాలి.

## కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా
# కోటి సంతకాల సేకరణ



**వి.ఆర్. పురం, డిసెంబర్5 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మండలంలోని వైస్సార్సీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలని చూస్తుందని కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రేఖపల్లి గ్రామపంచాయతీలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందనీ మండల నాయకులు అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వైసిపి మండల అధ్యక్షుడు మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ వైద్య,విద్యను,పేద విద్యార్థులకు దూరం చేయాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేక ప్రజల్లోకి వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ సంతకాల కార్యక్రమం చేయడం జరుగుతుందని, ఇప్పటికైనా ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మాచర్ల గంగయ్య, ఆర్టి. ఐ. విభాగం జిల్లా అధ్యక్షులు బోడ్డు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ, మండల నాయకులు కాపారపు ఉమామహేశ్వరరావు, చీమల కాంతారావు, మోడెమ్ నరేష్, ముత్యాల జయరాజు, సోడి చిరంజీవి, రేపు పోసి, రేఖపల్లి అంబేద్కర్ కాలనీ యూత్ సభ్యులు మాచర్ల రిషి, పెరుమల వేణు, మేడిపల్లి ముత్యాలరావు, పలివెల నాగేశ్వరరావు, మాచర్ల వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.ఋ

## తిరుమలలో డ్రోన్ కెమెరా కలకలం

**తిరుమల డిసెంబర్ 05 (తెలుగురాష్ట్రం విలేఖరి):** తిరుమలలో డ్రోన్ కెమెరా కలకలం రేపింది. తితిదే మూడంచెల భద్రతను దాటుకొని ఓ భక్తుడు ఆ కెమెరాతో వచ్చాడు. అలిపిరి తనిఖీ కేంద్రం దాటి వచ్చి తిరుమలలోని శిలాతోరణం వద్ద భక్తులు, భద్రతా సిబ్బంది ఉండగానే దాన్ని ఎగురవేశాడు. గమనించిన భక్తులు.. విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే విజిలెన్స్ సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకుని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. డ్రోన్ కెమెరా ఎగురవేసిన వ్యక్తిని ప్రవాస భారతీయుడిగా గుర్తించారు. అందులో రికార్డయిన దృశ్యాలను అధికారులు పరిశీలిస్తున్నారు. విచారణ అనంతరం అతడిని పోలీసులకు అప్పగిస్తామని తెలిపారు.




## ఏపీలో ఐదు కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో పీజీ ఫీజుల ఖరారు

- ప్రభుత్వ కోటా సీట్లకు రూ. 30 వేలుగా నిర్ణయం
- సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు రూ. 9 లక్షల ఫీజు
- ఈ ఏడాది 60 పీజీ సీట్లను కేటాయించిన జాతీయ వైద్య మండలి
- ఫీజుల నిర్ణయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదముద్ర

**అమరావతి డిసెంబర్ 05 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సులకు ప్రభుత్వం ఫీజులను ఖరారు చేసింది. ఈ మేరకు తీసుకున్న నిర్ణయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు. ప్రభుత్వ కోటా సీట్లకు వార్షిక ఫీజును రూ. 30 వేలుగా, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా సీట్లకు రూ. 9 లక్షలుగా నిర్ధారించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ఐదు వైద్య కళాశాలలకు ఈ విద్యా సంవత్సరం నుంచి 60 పీజీ సీట్లను జాతీయ వైద్య మండలి (NMC) కేటాయించిన విషయం తెలిసిందే. ఈ సీట్లకు సంబంధించి ఫీజుల ఖరారుపై ప్రభుత్వం దృష్టి సారించింది. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించిన విధానంలో ఫీజులను సమీక్షించి ఈ తుది నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదంతో ఫీజుల ఉత్తర్వులు వెలువడనున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఈ ఏడాది నుంచే కొత్త పీజీ సీట్లలో ప్రవేశాలకు మార్గం సుగమమైంది.



## వడ్డీ రేట్లు పావు శాతం తగ్గింపు




ముంబయి : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మరోమారు వడ్డీ రేట్లకు కోత పెట్టింది. రెపోరేటును పావు శాతం తగ్గించి 5.25 శాతానికి పరిమితం చేసింది. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన మూడు రోజుల పాటు సాగిన ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) నిర్ణయాలను ఆయన శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ కాలంలో మూడు సార్లు వడ్డీ రేట్లను 100 బేసిస్ పాయింట్లు తగ్గించామని గుర్తు చేశారు. నాలుగోసారి కూడా 25 బేసిస్ పాయింట్లు తగ్గించామని చెప్పారు. దీంతో ఈ ఏడాదిలో ఇప్పటివరకు రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. ఈ క్రమంలో గృహ, వాహన, రిటైల్, వ్యక్తిగత రుణాలపై భారం తగ్గుతోంది. రూపాయి పతనం కొనసాగుతున్న ప్పటికీ.. ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయికి పడిపోవడంతో వృద్ధి రేటు పెరగడంతో రేట్ల కోత చేపట్టామని మల్హోత్రా అన్నారు. బాహ్య వాతావరణం ప్రతికూల సవాళ్లతో కూడుకున్నప్పటికీ భారతీయ ఆర్థిక వ్యవస్థ మెరుగైన ప్రగతిని ప్రదర్శించిందన్నారు. తగ్గిన ద్రవ్యోల్బణం మరింత వృద్ధికి మద్దతుగా నిలవడానికి వీలు కల్పించనుందని పేర్కొన్నారు.

ఃఃజిఎస్‌టి శ్లాబుల తగ్గింపునతో కొనుగోళ్లు పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో 8.2శాతం వృద్ధి నమోదయ్యింది. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ జిడిపి అంచనాలను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నాం. ధరలు కూడా తగ్గుముఖం పట్టినందున 2025-26కు గాను ద్రవ్యోల్బణం అంచనాలను 2.6 శాతం నుంచి 2 శాతానికి అంచనా వేస్తున్నాము. విదేశీ మారక నిల్వలు 686 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఇవి సరిపోతాయి.ఃః అని మల్హోత్రా తెలిపారు. ఆర్‌బిఐ వడ్డీ రేట్ల కోత వార్తలతో స్టాక్ మార్కెట్లు సానుకూలంగా ట్రేడింగ్ అయ్యాయి. వారాంతం సెషన్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ 447 పాయింట్ల లాభంతో 85,712కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 153 పాయింట్లు పెరిగి 26,186 వద్ద ముగిసింది.

తెలుగురాష్ట్రం దినపత్రిక



# లోకేష్‌కు అభినందనలు

**అమలాపురం డిసెంబర్ 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమలాపురం రూరల్ మండలం బండారులంక జెడ్‌పిహెచ్ స్కూల్, ప్రాధమిక పాఠశాలలో ,మెగా పిటిఎం 3.0,,పాల్గొని అవకాశం కలిగింది,,ఈ ఆలోచన చేసిన,,నారా లోకేష్‌కి. నా ధన్యవాదాలు. పాఠశాలల కేవలం చదువు మాత్రమే కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాద్యతలు తెలియ చేసే వేదిక గా, సహపంక్తి భోజనములు కులమతములకు తావుకుండా అందరు కలసి వుండే ఈ సందర్భం ఈ రోజు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన ,నారా ,లోకేష్ గారి కి నా అభినందనలు

## బోడకొండమ్మ ఘాట్ రోడ్ లో బీభత్సం...
## ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలు!

**చింతపల్లి, డిసెంబర్ 05 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**



అల్లూరి జిల్లాలోని బోడకొండమ్మ ఘాటి రహదారి మరోసారి తన ప్రమాదకర రూపాన్ని బయటపెట్టింది. గత కొన్ని వారాలుగా వరుస ప్రమాదాలు జరుగుతున్న ఈ మార్గంలో శుక్రవారం ఉదయం జరిగిన ఘటనలో జి. మాడుగుల మండలంలోని వేమరాజు కోడపల్లి (చవదివీధి) గ్రామానికి చెందిన కిముడు దావీదు రాజు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం దావీదు రాజు తన భార్య బోనంగి వెంకటలక్ష్మి (వాణి) స్వగ్రామం డౌనూరు నుండి చింతపల్లి వైపు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా, బోడకొండమ్మ ఆలయం%-%రావి మామపాకాల మధ్య ఉన్న అతి ప్రమాదకర మలుపు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాద తీవ్రతకు అనుగుణంగా తల, చేతులకు గంభీర గాయాలు కావడంతో అతని పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అదే సమయంలో నర్సీపట్నం వైపు వెళ్తున్న చింతపల్లి ఎస్సై వి. వెంకటేశ్వరరావు ప్రమాదాన్ని గమనించి వెంటనే సహాయం అందించారు. క్షతగాత్రుడిని లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు అతని ఆరోగ్య స్థితి గంభీరంగా ఉన్నట్లు తెలిపారు. ఇటీవలి కాలంలో ఈ ఘాట్ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. కేవలం నిన్నే (గురువారం) అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని నర్సీపట్నం ఆసుపత్రికి తరలిస్తుండగా, ఆటో అదుపుతప్పి 30 అడుగుల లోయలో పడిపోవడంతో గిరిజన మహిళ కిలో సీతమ్మ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ప్రజలు మరచిపోకముందే మరో ప్రమాదం చోటుచేసుకోవడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. స్థానికుల మాటల్లో రోడ్డుపై ఏర్పడిన లోతైన గుంతలు, స్లిప్పరీ వంపులు, రాత్రివేళ హెచ్చరిక బోర్డుల లేమి, అతి సన్నని మలుపులు ప్రమాదాలకు కారణమని చెబుతున్నారు. ఈ ప్రమాదంపై ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పిల్లల భవిష్యత్తు బలపడేది తల్లిదండ్రుల
# భాగస్వామ్యంతోనే!

**అంతర్ల ఎంపీపీ పాఠశాలలో మెగా పేరెంట్స్ డే 3.0 ఘన విజయవంతం.**
**పాఠశాల ఉపాధ్యాయుడు మురళి బాబు, చైర్మన్ సోమరాజు.**




**చింతపల్లి, డిసెంబర్ 05 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

పాఠశాలలో పాఠాలు నేర్చుకోవడం ఎంత ముఖ్యమో వ్యక్తిగత పరిశుభ్రత కూడా అంతే ప్రధానమైంది అని పాఠశాల ఉపాధ్యాయుడు అదర మురళి బాబు తల్లిదండ్రులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ డే 3.0 కార్యక్రమాన్ని అంతర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల చైర్మన్ కవడం సోమరాజు ఆధ్వర్యంలో ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు. కార్యక్రమానికి తల్లిదండ్రులు భారీగా హాజరై పాఠశాల బోధనా విధానాలు, విద్యార్థుల క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, విద్యా పురోగతిపై ఉపాధ్యాయులతో చర్చించారు. పిల్లల అభ్యాస నైపుణ్యాలు, హాజరు వివరాలు, పరీక్షల్లో సాధిస్తున్న ఫలితాలను ఉపాధ్యాయులు దేవమణి, కృష్ణకుమారి, బేబీ తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధికి పాఠశాల అందిస్తున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, నూతన బోధనా పద్ధతులు, వ్యక్తిగత దృష్టి పెట్టడం వంటి అంశాలను తల్లిదండ్రులు ప్రశంసించారు. చైర్మన్ సోమరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు పాఠశాలలు కలిసి పనిచేస్తేనే విద్యార్థుల భవిష్యత్తు బలపడుతుంది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం పాఠశాల నిరంతరం కృషి చేస్తోంది అని ఆయన పేర్కొన్నారు. పేరెంట్స్ డే సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు, చిత్రకళ, క్రియేటివ్ మోడల్స్ హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సందడితో ఉత్సాహభరితంగా ముగిసింది.

## ఘనంగా పిటిఎం 3.0 కార్యక్రమం



**అమలాపురం డిసెంబర్ 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమలాపురం రూరల్ మండలం ఏ.వేమవరప్పాడు :- కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ గారి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మెగా పిటియం 3.0 నిర్వహిస్తున్నారు దానిలో భాగంగా ఏ.వేమవరప్పాడు గ్రామంలో గల మండల ప్రజా పరిషత్ పాఠశాలలో జరిగిన మెగా పిటియం 3.0 సర్పంచ్ పందిరి విజయ మరియు ఉప సర్పంచ్ వాకపల్లి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఏ.వేమవరం పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక అధికారిగా దుర్గా ప్రసాద్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చిక్కం హరిబాబు గారు మరియు ఉపాధ్యాయులు SA1,FA1,FA2 పరీక్షా విధానం గురించి వివరించడం తదనంతరం ప్రోగ్రెస్ రిపోర్టులు అందచేయడం, TLM, Science Kits,Maths Kits ప్రదర్శించడం జరిగింది. ఉపసర్పంచ్ వాకపల్లి వెంకటేశ్వరరావు గారు ఈ సందర్భంగా పిటియం3.0 ఉద్దేశించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కల్పన కోసం ఇటు ఉపాధ్యాయులు అటు తల్లితండ్రులు సమపాళ్లలో అండగా నిలవాలని అదేవిధంగా క్రమ శిక్షణ తో మెలిగేలా చూడాలని ప్రసంగించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యురాలు రాయుడు నాగదేవి,గ్రామ కమిటీ నాయకులు కొమ్మాబత్తుల ప్రసాద, యిళ్ళ సత్యన్నారాయణ, గొల్లపల్లి రాజేష్ విద్యార్దుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సంక్రాంతి సంబరాల పనుల ఏర్పాట్లు, అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అయితాబత్తుల











**అమలాపురం డిసెంబర్ 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జనవరి సంక్రాంతి పండుగలో రెట్టింపు సందడి వచ్చేలా ఎస్ యానాం బీచ్ లో నిర్వహించే సంక్రాంతి సంబరాల పనుల ఏర్పాట్లను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరిశీలించారు. బీచ్ లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఎమ్మెల్యే గారి వెంట రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, యువనాయకులు అయితాబత్తుల కరణ్, లంకే భీమరాజు, అయితాబత్తుల రాజశేఖర్ మరియు తదితరులు ఉన్నారు



# తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల ఆత్మీయ మేళా...

**మన్యంలోని పాఠశాలల్లో మెగా పీటీఎం 3.0 సందడి.**
**చింతపల్లి మండలవ్యాప్తంగా విద్యాసంస్థల్లో పండగ వాతావరణం.**

**చింతపల్లి, డిసెంబర్ 05 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

విద్యార్థుల విద్యా పురోగతిని తల్లిదండ్రులకు చేరవేసే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన మెగా పీటీఎం 3.0 కార్యక్రమం చింతపల్లి మండలంలోని పాఠశాలలన్నింటిలో అంగరంగ వైభవంగా జరిగింది. పాఠశాలలు రంగులద్దిన ఆవరణలు, విద్యార్థుల కళాత్మక ప్రదర్శనలు, సైన్స్ మోడళ్ల ప్రదర్శనలతో పండగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు సాగిన రామరాజు పడాల్ ఆధ్వర్యంలో బాలురు%-%1 ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్లాస్టిక్



వినియోగం లేకుండా పాఠశాల ఆవరణాన్ని అలంకరించడం, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు హాజరైన వారిని మెప్పించాయి. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే పాఠం ప్రతి అక్షరం హృదయంలో నిలవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీటీసీ పోతురాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించే పాఠాలన్నింటిని ఆసక్తిగా గ్రహిస్తేనే పిల్లలు ఉన్నత స్థానాలకు చేరతారు. పరీక్షల్లో ఆ విజ్ఞానం ప్రతిఫలించినప్పుడే ఉపాధ్యాయుల కష్టానికి వెలుగు వస్తుంది. ఇంటికి వచ్చినప్పుడు తల్లిదండ్రులు పిల్లల చదువు గురించి అడిగి తెలుసుకోవడం తప్పనిసరి అన్నారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, జనసేన మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, అరకు పసి బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, ఏఎంసీ డైరెక్టర్లు పెద్దిరెడ్డి బేతాళుడు, కిముడు కృష్ణమూర్తి, రీమల నవభరత్ తదితర నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకే కాదు



తల్లిదండ్రులకు కూడా పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దే బాధ్యత సమానమే. కొన్నిచోట్ల పిల్లలను ఇంటిపనులకు ఉపయోగించడం వలన చదువులో వెనుకబడుతున్నారు. విద్యే పిల్లలకు ఇవ్వగలిగే గొప్ప బహుమతి వారిని నిరంతరం పాఠశాలకు పంపుతూ పర్యవేక్షించాలి అన్నారు. ఉపాధ్యాయులు మెగా పీటీఎం ఉద్దేశం విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నారో తల్లిదండ్రులకు తెలియజేయడం. వెనుకబడిన విద్యార్థుల వివరాలను తల్లిదండ్రులతో పంచుకొని, వారికి ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నాం. బాలురు%-%2, బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల, జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమాల్లో ఆర్ట్ ఎగ్జిబిషన్లు, సైన్స్ మోడల్స్, స్టూడెంట్ ప్రాజెక్టులు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు చేసిన ప్రాజెక్టులను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎం. సాంబశివ, ఎస్. చల్లంగి, కృష్ణకాంత్, కె. ప్రసాద్, రామారావు, వీరన్న పడాల్, సేవ ఈశ్వరమ్మ, గుత్తల అర్జున్, సిడిపిఒ శ్రీదేవి, ఐసిడిఎస్ సూపర్వైజర్ గౌరీ సౌజన్య, బాలురు%-%2 పాఠశాల ఉపాధ్యాయులు కె. అర్జున్, పి. చిట్టిబాబు, గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పండుగలా మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశం
# ఎమ్మెల్యే ఆనందరావు











**అమలాపురం డిసెంబర్ 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యాశాఖ నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం పండుగలా జరిగిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. పట్టణంలోని మహాత్మా గాంధీ మునిసిపల్ హైస్కూల్ లో జరిగిన మెగా పీటీఎం 3.0 కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతున్నారని, విద్యా శాఖ మంత్రిగా నారా లోకేష్ విద్యా వ్యవస్థలోనే వినూత్న రీతిలో మార్పులు తీసుకొచ్చారని అన్నారు. ఈ మార్పుల వల్ల విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. తాను కూడా ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థినని గుర్తు చేశారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఢిల్లీ స్థాయి వరకూ వెళ్లారంటే అది ఈ హైస్కూల్ ఉపాధ్యాయుల పని తీరుకి నిదర్శనం అన్నారు. హైస్కూల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఇందుకోసం కోరిన విధంగా సైకిల్ షెడ్డు మరియు అభివృద్ధి పనులకు చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మునిసిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్ర మణి, అమలాపురం టిడిపి అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, జనసేన నాయకులు కల్వకోలను తాతాజీ, ఏడిద శ్రీను, పిండి రాజా, కౌన్సిలర్ పిండి అమరావతి, దున్నాల దుర్గా, దిన్న బాబు, పుల్లయ్య నాయుడు, బొర్రా ఈశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు గాణ సత్యనారాయణ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.











## మోడల్ ప్రైమరీ స్కూల్ లో ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం



**కూనవరం, నవంబర్ 5 (తెలుగురాష్ట్రం విలేకరి):**
అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం మోడల్ ప్రైమరీ స్కూల్ లో ప్రధానోపాధ్యాయులు వి.వర లక్ష్మి అధ్యక్షతన ఘనంగా మెగా పేరెంట్స్ – టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ నందికొండ దుర్గా భవాని ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ అందరి సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చెయ్యాలని, విద్యార్దులు క్రమం తప్పకుండా స్కూల్ కి హాజరు కావాలని సూచించారు. హెచ్ఎం మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇంటి వద్ద పిల్లల చదువుపై శ్రద్ధ పెట్టాలని, మన చుట్టూ జరిగే బాల్య వివాహాలను మనమందరం బాధ్యతగా నిర్మూలిద్దాం అని సూచించారు. సమావేశంలో సహోపాధ్యాయులు కట్టం వీరయ్య, పేరెంట్స్ కమిటీ సభ్యులు, మహిళ పోలీసు రజిని, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మెగా 3.0 పేరెంట్స్ - టీచర్స్ మీట్



**ఎటపాక, డిసెంబర్ 5 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
గౌరిదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముమ్మిడివరం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మెగా 3.0 పేరెంట్స్ – టీచర్స్ ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్య వ్యవస్థను పూర్తి ప్రక్షాళన దిశగా తీసుకువెళ్తున్నారని అన్నారు. అలాగే విద్యార్థిని విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు, డొక్కా మాణిక్యమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రత్యేకంగా సన్నబియ్యం, ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం నెరవేర్చడం జరుగుతుందన్నారు. ఇంట్లో ఎంతమంది చిన్నారులు చదువుతూ ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని మాట ఇవ్వటం జరిగిందన్నారు. ఆ మాట ప్రకారం తల్లికి వందనం ఇవ్వడం జరిగిందని, ఇంత మంచి ప్రభుత్వం గతంలో ఎన్నడూ చూడలేదని, భవిష్యత్తులో విద్యార్థుల అభివృద్ధి కోసం విద్యా వ్యవస్థలో ఇంకా అనేక రకాల మార్పులు తీసుకురావడం కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు చేపట్టారని అన్నారు. అనంతరం టిడిపి ఎటపాక మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా విలువలతో కూడిన విద్యను బోధించడం జరుగుతుందని, విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించకుండా, మంచిగా విద్యనభ్యసించి వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సరియం రాజులు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సర్పంచ్ శివ కనకరాజు, ఉపసర్పంచ్ నరసింహారావు, టిడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు అమరవరపు రాము, స్థానిక వైద్యాధికారులు డా.దేవీనాగ్, డా.శ్రీలక్ష్మి, పోస్ట్ మాస్టర్ చిలుకూరు శ్రీనివాసరావు, వార్డెన్, గ్రామ పెద్దలు, పేరెంట్స్, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిల్లల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యం



**జగ్గయ్యపేట, డిసెంబర్ 5 (తెలుగురాష్ట్రం విలేకరి):**
పట్టణంలోని మిట్టగూడెంలో జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల (గర్ల్స్ హై స్కూల్) నందు నిర్వహించిన మెగా పేరెంట్ – టీచర్స్ సమావేశం (పిటిఎం) 3.0 లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీలు హేమాంజలి (యోగాంజలి) చేసిన యోగ, హేమశ్రీ చేసిన కర్ర సామును ఎమ్మెల్యే తిలకించి అనంతరం వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నడిచినప్పుడే విద్యా రంగం బలోపేతం అవుతుంది. పిల్లల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమైందని, ఇంటి నుండి లభించే ప్రోత్సాహమే విద్యార్థులకు నిజమైన బలం అవుతుంది" అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో విద్యా రంగాన్ని పూర్తిగా మారుస్తామనే సంకల్పంతో పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం విద్యపై చేసిన ప్రాధాన్యత వల్లే పాఠశాలలలో నాణ్యమైన బోధన వాతావరణం సృష్టించడానికి అనేక కార్యక్రమాలు అమలు అవుతున్నాయి అని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో 'నాణ్యతా విద్య%–%డిజిటల్ లెర్నింగ్%–%పాఠశాల అభివృద్ధి' అనే మూడు ప్రధాన లక్ష్యాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలను ఆధునీకరించడం, బోధన నాణ్యతను పెంపొందించడం, విద్యార్థుల భవిష్యత్తును పోటీ ప్రపంచానికి సన్నద్ధం చేయడం ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని తెలిపారు. పిటిఎం 3.0 వంటి సమావేశాలు విద్యార్థుల అభ్యాస స్థాయిని సమీక్షించడానికి, తల్లిదండ్రులు%–%ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెంచడానికి ఎంతో ఉపయోగకరమని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్థానిక స్థాయిలో కూడా తాను నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, 22వ వార్డు కౌన్సిలర్ గొట్టే నాగరాజు,15 వ వార్డు కౌన్సిలర్ ఇర్రి నరసింహారావు, హెచ్.ఎం. హేమ మాధవి, విద్యా కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి, విద్య కమిటీ వైస్ చైర్మన్ సర్వేపల్లి శ్రీనివాస్, ప్రకాష్, తాండవ కృష్ణ, స్కూలు యాజమాన్యం పాల్గొన్నారు.

## విద్యా కమిటీ చైర్మన్ గా కుమార్



**ముమ్మిడివరం, డిసెంబర్ 5 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
కొత్తలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్య కమిటీ చైర్మన్ గా జైను లక్ష్మణ కుమార్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. కొత్తలంక గ్రామంలో అర్ఎంపీ వైద్యునిగా విశిష్ట సేవలు అందిస్తున్న కుమార్ లాంటి వ్యక్తికి విద్య కమిటీ చైర్మన్ ఇవ్వటం శుభపరిణామం అని విద్యార్థుల తల్లిదండ్రులు హార్షం వ్యక్తం చేశారు. తల్లి తండ్రులు, ఉపాధ్యాయల ఆత్మీయ సమావేశంలో నూతన డైరెక్టర్లుగా మోకా రాజు, దొంగ గోపాల కృష్ణ, మట్టపర్తి లక్ష్మి ఎన్నికయారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పెద్దిరాజు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో తయారు చేయాలని సామాన్యుడికి సైతం కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య అందించాలని ప్రభుత్వం విశిష్ట కృషి చేస్తుందని అన్నారు ఈసమావేశం లో కొత్తలంక ఎంపీటీసీ గీసాల దుర్గ చంద్రరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, వీపూరి నాగరాజు,మాజీ సర్పంచ్ గుత్తుల మల్లికార్జున రావు, నాయకులు, తోలేటి రాంబాబు,నడిమింటి సూర్య భాస్కరం, దాసరి గంగాధర్ రావు,జంగారెడ్డి రమేష్,దూడలా స్వామి, బీర శివ,మట్టా గోవిందు, వంగా సీతారామ్, మండూరి బుజ్జి, శామంతకుర్తి సుబ్బారావు తో పాటు పలువురు నాయకులు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, గోవర్ధన్ గిరిఉపాధ్యాయ లు, కాశీ బాబాయ్, పెద్దిరాజు, గంగుల సురేష్, మెండి శ్రీనివాస్, సోమరాజు, నాగులాపల్లి శ్రీనివాస్,సుజాత,లక్ష్మి బాయి, బేబి పద్మజ, పోలిశెట్టి సత్యనారాయణ, పోలిశెట్టి వీరబాబు, వల్లి, లతో పాటు అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఎప్పుడు ఉండేది తెదేపానే

### -ఎమ్మెల్యే శిరీషదేవి



**రంపచోడవరం, డిసెంబర్ 5 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
గ్రామస్థాయి నుండి వెంటాడుతున్న ప్రతి సమస్య పరిస్కారం కొరకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నట్లు రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి స్పష్టం చేసారు. రంపచోడవరంలో ఆమె క్యాంపు కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంతమోహన్ అధ్యక్షతన శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాదర్బార్ లో తన దృష్టికి వచ్చిన దరఖాస్తులను సాధ్యమైనంత వరకూ వెంటనే పరిస్కారం అయ్యేలా చూస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ఉంటే ఆయా శాఖలకు సిఫార్సు చేసి త్వరగా పూర్తి అయ్యేలా చేసేలా చూస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే రహదారులు, గృహ నిర్మాణం బిల్లులు, కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు తదితర సమస్యలకు సంబంధించిన అర్జీలు రాగా వాటిని సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త కష్టం తనకు తెలుసునని వారికి అందరికీ సముచిత స్థానం వస్తుందని సూచించారు. కార్యకర్తలకు మంచి గుర్తింపు ఇచ్చేది మన తెదేపానే అని కొనియాడారు. కార్యకర్తలకు ఎలాంటి కష్టం ఉన్నా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టిలో పెట్టాలని కోరారు. ప్రతీకార్యకర్త ప్రభుత్వ కార్యాలయాల్లో మన్నన పొందేలా చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టిలో పెట్టాలని అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని విజయం దంకా మోగించాలని కోరారు. అలాగే కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయము చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమం నియోజకవర్గం ఎస్టీ విభాగం అధ్యక్షులు పండా బాబీ, క్లస్టర్ ఇంచార్జి కారం సింహాచలం, సీతపల్లి బాపనమ్మ గుడి చైర్మన్ కుంజం బాపన్న దొర సీతపల్లి బాపనమ్మ తల్లి గుడి డైరెక్టర్ సిద్ధా వెంకన్న దొర, మండల ప్రధాన కార్యదర్శి కోసునాగన్న దొర, వీక నాగన్న దొర, దేవీ పట్నం మండల తెలుగు యువత నాయకులు జొన్నల శ్రీనివాస్ కుమార్, పుల్లంగి సర్పంచ్ వీరవల్లి జార్జ్ బాబు, ఏ ఎం సి డైరెక్టర్ జొన్నల రాంబాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మా పాఠశాలకు క్రీడా స్థలం కావాలి : నాగిడి రాంబాబు



**మొగల్తూరు, డిసెంబర్ 5 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
మండల పరిధిలోని ముత్యాలపల్లి గ్రామంలో శ్రీ బండి ముత్యాలమ్మ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు, శుక్రవారం హై క్రీడాస్థలం కావాలని నిరసన, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవ కార్యకర్త, పూర్వ విద్యార్థి నాగిడి రాంబాబు పాల్గొని ఈ విధంగా మాట్లాడారు.. పాఠశాలకు ఆట స్థలం అనేది విద్యార్థుల శారీరక, మానసిక మరియు సామాజిక అభివృద్ధికి చాలా అవసరం 1997 పూర్వం యూపీ స్కూలు ఉండేదని, అప్పుడు హైస్కూల్ కావాలి అంటే ఐదు ఎకరముల స్థలముఉంటే యూపీ స్కూల్ ను హై స్కూల్ గా మార్చారు. కానీ ఈ రోజున ఆ ఐదు ఎకరాల స్థలము కనిపించడం లేదు. అన్నారు. ఈ పాఠశాలకు క్రీడాస్థలం లేకపోవటం వలన విద్యార్థులకు ఆటల నిర్వహణకు చాలా ఇబ్బందులు గురవుతున్నారని తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా క్రీడా స్థలంఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించాలని కోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్మెంట్ చైర్మన్ మరియు సభ్యులు తల్లిదండ్రులు,పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు హై స్కూల్ చైర్మన్ కొల్లాటి చూడమని, దొంగ సాంబమూర్తి, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పూర్తి సహకారం అందించాలి

### -దర్శిపర్రు సొసైటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం, డిసెంబర్ 5 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
రాష్ట్రానికి అన్నం పెట్టే రైతన్నలకు సహాయ సహకార ఆనందించేందుకే సొసైటీల ఏర్పాటు జరిగిందని అలాంటి సహకార సంఘ చైర్మన్ గా పదవి పొందిన వారు వారికి పూర్తి సహాయ సహకారాలు అందించి వ్యవసాయానికి కావలసిన అవసరాలు తీర్చే ఒక కర్మాగారంలా సొసైటీలు మార్చాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెంటపాడు మండలం దర్శిపర్రు సొసైటీ త్రిష కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా త్రిష కమిటీ చైర్మన్గా పాలూరి భూపాల్, సభ్యులుగా పాలూరి సత్యనారాయణ, పాలూరి వెంకట్రావుతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సమస్యలు ఏదైనా వచ్చిందంటే అది తన సమస్యగా భావిస్తానని అదే మాదిరిగా భూములు ఆన్లైన్ చూపించడం లేదని దర్శిపర్రు రైతులు తనకు చెప్పిన వెంటనే రాష్ట్ర కమిషనర్ వరకు ఈ సమస్య తీసుకెళ్లానన్నారు. ఈ సమస్య పరిష్కరించడానికి కృషి చేసిన సర్వే బృందానికి కలెక్టర్, వీఆర్వో, తాసిల్దార్ అందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే సంక్రాంతి నాటికి తాడేపల్లిగూడెంలో రోడ్ల నిర్మాణానికి నిధులు తీసుకొచ్చామని సంక్రాంతి పండుగకు అంతా రోడ్లతో సిద్ధమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకెళ్ళి డబ్బు లేని పరిస్థితుల్లో మనల్ని నెట్టిందని కానీ ఆ సమస్యను అధిగమించి అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఎతకోటఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన మండల అధ్యక్షుడు పుల్ల బాబి, జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు, సర్పంచ్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పోలీసులపై ఆరోపణలు అవాస్తవం

### ప్రజల భద్రత మా ప్రధాన బాధ్యత -తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నర్సింహ కిషోర్




**రాజమండ్రి, డిసెంబర్ 5 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని పలు పోలీస్ స్టేషన్లలోని అధికారులు లంచాలకు అలవడ్డారనే ఆరోపణలను జిల్లా ఎస్పీ నర్సింహ కిషోర్ తీవ్రంగా ఖండించారు. గురువారం రాత్రి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఆయన తెలిపారు. ఈ ఏడాది కాలంలో పోలీసులు ఫైల్ చేసిన, పట్టుకున్న కేసుల వివరాలను ఆయన వివరణ ఇచ్చారు.
తూర్పుగోదావరి జిల్లా పోలీసులు గత ఏడాది కాలంగా ప్రజలకు బాధ్యతాయుత సేవలు అందిస్తూ శాంతి భద్రతలను కాపాడడంలో నిరంతరం కృషి చేస్తున్నామని ప్రభుత్వం మరియు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని స్థాయిల్లో పోలీసులు 24 గంటలు విధులు నిర్వహిస్తున్నారని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ తెలిపారు. టెక్నాలజీ వినియోగంతో నేరాలను అరికట్టే పనే కాకుండా ప్రజల భాగస్వామ్యంతో 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు, అదనంగా 17 డ్రోన్లను నిఘా కోసం వినియోగిస్తున్నట్టు పేర్కొన్నారు.

## డిఫరెంట్ కధతో తెరకెక్కనున్న 'శంబాల'

### -డిసెంబర్ 25న థియేటర్లలో విడుదల

### -రాజమండ్రిలో సందడి చేసిన హీరో ఆది సాయికుమార్



**రాజమహేంద్రవరం, డిసెంబర్ 5(తెలుగురాష్ట్రం విలేకరి) :**
శంబాల సినిమా డిఫరెంట్ కథతో తెరకెక్కిందని హీరో ఆది సాయికుమార్ పేర్కొన్నారు. సినిమా ప్రమోషన్లో భాగంగా శుక్రవారం స్థానిక ఎఫ్ కేఫ్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆది సాయికుమార్ మాట్లాడుతూ సైన్స్, మూఢనమ్మకాల నేపధ్యంలో శంబాల సినిమా రూపొందించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్క కేరెక్టర్ ప్రత్యేకంగా ఉంటుందని, అంతా చాలా కష్టపడి పనిచేసినట్లు వివరించారు. శంబాల అనే రహస్యమైన ప్రాంతంలో ఏమి జరిగిందన్న కథను దర్శకుడు యుగంధర్ మునీ చాలా ఆసక్తికరంగా తెరకెక్కించారని చెప్పారు. సినిమా చూసిన ప్రతిఒక్క ప్రేక్షకుడు డిఫరెంట్ మూవీని చూశామన్న సంతృప్తిని వ్యక్తం చేస్తారన్నారు. ఈనెల 25 ప్రేక్షకుల ముందుకు వస్తున్నామని, తమను ప్రేక్షకులు ఆశీర్వదించాలని కోరారు. తెలుగుతో పాటు తమిళం, హిందీలో కూడా పెద్దఎత్తున విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. హీరోయిన అర్చన ఐయ్యర్ మాట్లాడుతూ శంబాల ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. ఇప్పటికే ట్రైలర్కు మంచి ఆదరణ లభించిందన్నారు. శంబాల ఉత్కంఠతో పాటు, ప్రేక్షకులను కొద్దిగా భయపెడుతుందన్నారు. శివ, ఇంద్రనీల్లు మాట్లాడుతూ ఇందులో ప్రతి ఒక్క కేరెక్టర్కు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆది సాయికుమార్కు ఇది ఒక బిగ్ హిట్ అవుతుందన్నారు. ప్రేక్షకులు థియేటర్కు వచ్చి సినిమా వీక్షించాలని కోరారు. ఈ చిత్రాన్ని రాజశేఖర్ అన్నాభిమోజు, మహిందర్ రెడ్డిలు నిర్మించారు. శ్రీచరణ్ సంగీతాన్ని అందించారు.

## ఘనంగా మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

**వి.ఆర్.పురం, డిసెంబర్ 5 (తెలుగు రాష్ట్రం విలేఖరి):**
సున్నం వారి గూడెం బాలుర ఆశ్రమ పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఘనంగా నిర్వహించారని ప్రధానోపాధ్యాయులు బొర్రా రమేష్ ఓ ప్రకటనలోతెలిపారు. మొదటగా విద్యార్థుల తల్లిదండ్రులను, పాఠశాల యజమాని కమిటీ సభ్యులను పుష్పగుచ్ఛాలతో, ఘనస్వాగతంతో పాఠశాల నందు ఆహ్వానించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు, తమ పిల్లల ప్రోగ్రెస్ రిపోర్టును చూపించి విద్యార్థుల పురోగతిని తెలిపారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, వాటి వల్ల వచ్చే దుష్పరిమాణలను వివరించారు. తల్లిదండ్రులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను, నేటి బాలలే రేపటి పౌరులు అని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ ఉపాధ్యాయులు జల్లి బాబురావు, టి వెంకటయ్య పిల్లలకు తగు సూచనలు ఇచ్చారు. తదుపరి పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సుమారుగా 300 మందికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో చక్కటి భోజనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, భోదనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఏపీ నిట్ లో ఆక్టోపస్ కమెండోస్ మాక్ డ్రిల్

**-ఆకట్టుకున్న కమెండోస్ విన్యాసాలు**









**తాడేపల్లిగూడెం, డిసెంబర్ 5 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో శుక్రవారం ఆక్టోపస్ కమెండోస్ డీఎస్పీ బి.రాంబాబు ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు దాడి చేస్తే వాటిని సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి, ఆత్మ రక్షణ ఎలా పొందాలి, ప్రాణ, ఆస్థి నష్టం జరగకుండా బాధితులను ఎలా రక్షించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. విపత్కర పరిస్థితి ఎదురైనప్పుడు రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేసే విధానంతోపాటు ఉగ్రవాదులు చొరబడిన భవనం పరిసరాలు, లోపలకు, బయటకు వెళ్లే మార్గాలు, భవనంలో ఎంతమంది చిక్కుకుపోయారు, బాంబులను ఏమైనా అమార్చరా, సీసి కెమెరాల ద్వారా అనుమానితులను గుర్తించి వారిని మట్టుబెట్టటం వంటి అంశాల గురించి తెలియజేశారు. ముష్కరులు అమర్చిన బాంబులను డాగ్ స్క్వాడ్ తో కనుగొనటం, వాటిని నిర్వీర్యం చేయటం, భవనంపైనుంచి తాడు సహాయంతో కిందకు దిగటం, ఉగ్రవాదులు దాక్కున్న ఒక్కొక్క గదిని వెతికి ఉగ్రవాదులను అంతం చేయటం, ఆక్టోపస్ బృందాలు భవనంలోకి వెళ్లే విధానాలను కమెండోస్ కళ్ళకు కట్టినట్టు చూపించారు. ముందుగా ఆక్టోపస్ డిఎస్పీ రాంబాబు మాట్లాడుతూ అనుకోని విపత్కర పరిస్థితి ఎదురైనప్పుడు అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తేనే ఆపరేషన్ విజయమవుతుందని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో పోలీసులు, అగ్నిమాపక దళం, రెవిన్యూ, హెల్త్ డిపార్ట్మెంట్, ఇంటిలిజెన్స్ అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించిన సహాయ చర్యలు తీసుకుంటూనే సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెల్లి అధికారయంత్రాగాన్ని అప్రమత్తం చేయాల్సి ఉంటుందని వివరించారు. 40 మంది కమండోస్ అధునాతన తుపాకులతో బృందాలుగా విడిపోయి ముష్కరులను పట్టుకున్నారు. ఆక్టోపస్ కమాండోస్, పోలీసులు, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది రావటంతో విద్యా సంస్థల్లో ఏం జరుగుతుందో తెలియక విద్యార్థులు కొంతసేపు అయోమయానికి గురయ్యారు. తీరా అసలు విషయం తెలుసుకుని ఊరట చెందారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు శివాజీ, నీలకంఠ, తాడేపల్లిగూడెం డిఎస్పీ విశ్వనాథ్, సీఐ ఆదిప్రసాద్, ఎస్సై నాగరాజు, రెవిన్యూ అగ్నిమాపక, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బందితో పాటు పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే నా ఎజెండా

**-దర్శిపర్రు ప్రజాదర్బార్లో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్**



**తాడేపల్లిగూడెం, డిసెంబర్ 5 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
తనను గుండెల్లో పెట్టుకుని గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి తాను రుణపడి ఉంటానని ఆ రుణాన్ని ప్రజా సమస్యల పరిష్కారం ద్వారా కొంత వరకు తీర్చుకోగలనని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెంటపాడు మండలం దర్శిపరులో ప్రజాదర్బార్ కార్యక్రమంలో శుక్రవారం ఆయన ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శిపర్రు గ్రామంలో ప్రతినెల రూ.35 లక్షల 3500 పింఛన్ల రూపంలో ప్రభుత్వం అందిస్తుందని, తల్లికి వందనం ద్వారా తల్లులకు 81 లక్షల 12 వేల రూపాయలు ఇస్తున్నామన్నారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి 2,54 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందించామని గుర్తు చేశారు. అదేవిధంగా దర్శిపరు గ్రామంలో యల్లనాటి సమస్యగా ఉన్న ఆన్లైన్ భూముల రికార్డు పరిష్కరించామని రైతులు వారి భూమి ఆన్లైన్లో లేదని సతమతమవుతుంటే కలెక్టర్ తో మాట్లాడి ఈ సమస్య పరిష్కరించామన్నారు. అదేవిధంగా ఈయన భూముల సమస్య కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అత్యంత ఇబ్బంది కలిగించే రోడ్లు నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తామని జనవరి 1 నాటికి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచించామని తెలిపారు. అభివృద్ధి నిరంతరం జరగాలన్నదే నా తపన అని ప్రజల సొమ్ము ప్రజలకే అందించాలని సంకల్పంతో పనిచేస్తున్నామన్నారు. ఏ సమయంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా తనకు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. పుల్ల బాబి, అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం నుండి నిధులు విడుదల

**కూనవరం, నవంబర్ 5 (తెలుగురాష్ట్రం విలేఖరి):**



కూనవరం మండలం వెంకటాయపాలెంలో గ్రామంలోని మడకం వెంకటేశ్వర్లు టిడిపి మండల ఆర్గనైజేషన్ సెక్రటరీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంపీటీసీ నిధులు 3 లక్షల రూపాయలు విడుదల చేసిందని తెలిపారు. ఆ నిధుల నుండి ఈరోజు సిసి రోడ్డు నిర్మించుటకు వైసిపి నాయకులు వచ్చారని, వైఎస్ఆర్సిపి అధికారంలో ఉన్నన్ని రోజులు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి పార్టీ పోటీ చేయలేదని, టిడిపి ఎంపీటీసీలు, జడ్పీటీసీలు లేకపోయినా ఈరోజు ఎంపీటీసీ, జెడ్పిటిసి నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో నిధులు సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఏ పార్టీ వారు ఉన్నాగాని గ్రామాలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది.. రాష్ట్రం బాగుంటేనే దేశం బాగుంటుంది.. అని కూటమి ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోందని తెలిపారు. అది కూటమి ప్రభుత్వం గొప్పతనం అన్నారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఉన్నన్ని రోజులు ఎంపీటీసీ నిధులు గాని, సర్పంచ్ నిధులు గాని, జెడ్పిటిసి నిధులు గాని ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, కానీ వైఎస్ఆర్సిపి నాయకులు మేము ఇచ్చామని అనుకుంటున్నారని అన్నారు.

## తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లల మధ్య సమన్వయం అవసరం



**కూనవరం, నవంబర్ 5 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
పేగా పంచాయతీ సూరాకుంట గ్రామంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పీటియం 3.0 కార్యక్రమం సూరకుంట ఎంపీపీఎస్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు జీ.దీప్తి రవళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మాట్లాడుతూ హెచ్ పిసి, ఎఫ్ఎల్ఎన్ బేస్ లైన్ లెవెల్, నిపున్ లక్ష్యాలు గురించి, పిల్లల యొక్క విద్యా, స్కూల్ అభివృద్ధుల గురించి వివరించారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు మార్క్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ దేశయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మెగా పీటియం కార్యక్రమం ఎంతో ఉన్నతమైనది. ప్రభుత్వము పేరెంట్స్, టీచర్స్ కలిసి పిల్లల అభివృద్ధికి తోడ్పడాలని పిల్లల లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని దానికి తల్లిదండ్రులుగా పిల్లలకి ఎల్లప్పుడూ ఆసరాగా ఉండి వారి ఎదుగుదలకు తోడ్పడాలని కోరారు. స్కూల్ చైర్మన్ మడవి అరుణ మాట్లాడుతూ ప్రతి పిల్లవాడిని బడికి పంపే బాధ్యత తల్లిదండ్రులది, పిల్లలని వజ్రంల మార్చే బాధ్యత టీచర్, తల్లిదండ్రులదే అని చెప్పారు. మన పిల్లలు ఉన్నత స్థాయికి వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పాయం చంద్రయ్య, మాజి సర్పంచ్ సోడే ధర్మమ్మ , సూరకుంట గ్రామ పటేల్ లు తోడం మల్లేష్, చంద్రయ్య, యూత్ ప్రెసిడెంట్ తోడం క్రాంతి, యూత్ సెక్రటరీ నూప కోటేశ్, యూత్ జాయింట్ సెక్రెటరీ తోడం సుబ్బరాజు, పీసా కార్యదర్శి సోయం అర్జున్, ఆశ దిది సోడి రాములమ్మ, ఆంధ్రా లయోలా కాలేజీ నుండి డాక్టర్ జాన్, సోడే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా గురుకుల పాఠశాలలు

**-పెదతాడేపల్లి గురుకుల పాఠశాలలో మెగా పేరెంట్స్ మీట్**

**-రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ అదనపు కార్యదర్శి సునీల్ రాజ్ కుమార్ హాజరు**

**తాడేపల్లిగూడెం, డిసెంబర్ 5 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**



జాతీయస్థాయిలో గురుకులం విద్యార్థులు సీట్లు సాధించేలా రాష్ట్ర వ్యాప్తంగా 10 ఐఐటి, నీట్ అకాడమీ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ అదనపు కార్యదర్శి కె.సునీల్ రాజ్ కుమార్ అన్నారు. గూడెం మండలం పెదతాడేపల్లిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మెగా పేరెంట్స్ మీట్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ అదనపు కార్యదర్శి సునీల్ రాజ్ కుమార్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ చదివే విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించే ఐఐటీ, నీట్ లాంటి వాటిలో సీట్లు సాధించేందుకు నైపుణ్యం గల అధ్యాపకులతో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 250 నీట్ ఐఐటి సీట్లు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా గురుకుల పాఠశాలలో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకునే విద్యార్థులకు విజయవాడలో విద్యార్థులకు ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి పాఠశాలలో హెల్త్ సూపర్వైజర్ ను నియమించామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా వనరులను సద్విని చేసుకుని నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకోవాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యతోపాటు క్రీడలు సాంస్కృతిక, స్కౌట్ అండ్ గైడ్, ఎన్ సి సి లాంటి కార్యక్రమాల్లో రాణిస్తే ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలు త్వరితగతిన లభిస్తాయి అన్నారు. ఇటీవల లక్నోలో జరిగిన స్కౌట్ అండ్ గైడ్స్ జంబోరి కార్యక్రమంలో 56 మంది విద్యార్థులకు పాల్గొని సర్టిఫికెట్లు సాధించడం అభినందనీయం అన్నారు. రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచి నూతన ఆవిష్కరణల అడుగులు వేయాలన్నారు విద్యతోనే అభివృద్ధి సాధ్యం అన్నారు. ప్రిన్సిపల్ రాజారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టులలో నైపుణ్యం సాధించాలన్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి విద్యార్థులు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. పదో తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామన్నారు. ఆత్మీయ సమావేశంలో పెద్ద ఎత్తున తల్లిదండ్రులు పాల్గొనడం సంతోషం అన్నారు. అనంతరం అదనపు కార్యదర్శి సునీల్ రాజ్ కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. తల్లిదండ్రులకు క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ప్రకాష్, రవి జైన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్స్ వేడుకలు

**టీ. నర్సాపురం, డిసెంబర్ 5 (తెలుగురాష్ట్రం విలేఖరి):**



రాష్ట్ర విద్యా, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు పిల్లల బంగారు భవిష్యత్ కోసం, బడి వైపు ఒక అడుగు నినాదంతో తల్లితండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం కార్యక్రమన్ని మండల పరిధిలోని వెలగపాడు పంచాయతీ వీరభద్రవరం పాఠశాలలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధిలుగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరావు , మల్లుకుంట సొసైటీ చైర్మన్ శీలం సాయి వినయ్ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులతో పలు అంశాలు పై చర్చించారు. రాబోయే రోజుల్లో పాఠశాల అభివృద్ధి కి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. విద్యార్థుల తల్లితండ్రుల కూడా పిల్లల్ని బాగా చదివించి ఉన్నత స్థాయికి పంపించాలని సూచించారు. విద్యార్థుల భోజనం విషయంలో కూడా జాగ్రత్త వహించాలని సూచించారు. మా వంతు కానీ ప్రభుత్వం తరుపున పాఠశాలకు కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలోఎస్ఎంసి చైర్మన్ నాగు, గ్రామ సర్పంచ్ జలపాల్, ఉపాధ్యాయులు, జోనుబోయిన భాషా, చింతపల్లి సిద్దిరాజు, మామిళ్ళ అర్జునరావు, కృపారావు, పదిలం శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గేదల ఒంపు పాఠశాలలో మెగా పేరెంట్స్ మీట్

**మొగల్తూరు, డిసెంబర్ 5 (తెలుగురాష్ట్రం విలేఖరి) :**



ముత్యాలపల్లి గ్రామ పరిధి గేదల ఒంపు మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ లో కూటమి నాయకులు, గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు. ముందుగా సరస్వతి తల్లికి పూలదండ వేసి నమస్కరించారు. కూటమి నాయకులు మాట్లాడుతూ చదువు అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైన అవసరమని, అలాంటి విద్యను పూర్తిస్థాయి వసతులతో ప్రతి ఒక్కరికి సంపూర్ణంగా అందించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యకు అత్యంత ప్రాధాన్యనతను ఇస్తున్నదని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ఇటీవల మెగా డీఎస్సీ నిర్వహించి, ఉపాధ్యాయులను నియమించిందన్నారు. విద్యార్థులు విద్యా ప్రమాణాలను మరింత పెంచేందుకు మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించి, విద్యార్థులు ఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని ఆయా సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్అడ్డాల సూరిబాబు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితులను నిండా ముంచుతున్న అధికారులు



**దేవీపట్నం, డిసెంబర్ 5(తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను, దేవీపట్నం మండలం ఇందుకూరు పంచాయతీ కొండ మొదలు ఆర్ అండ్ ఆర్ కాలనీ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి హక్కులు చట్టాల గురించి వారికి అవగాహన పరచడం జరిగింది. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి చట్టాలు అమలు అయితేనే ఆదివాసులకు హక్కులు దక్కుతాయని కాబట్టి ప్రతి ఆదివాసి, ఆదివాసి సంక్షేమ పరిషత్ చేస్తున్న హక్కుల సాధన పోరాటంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజలు తెలియజేసిన సమస్య గురించి ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వలన ముంపుకు గురై ఆర్ అండ్ ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలకు భూమికి భూమి ఇవ్వలేదని అదేవిధంగా చాలా మంది ఆదివాసులకు నష్టపరిహారం చెల్లించలేదని దీని మూలాన ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులకు ఎంత విన్నవించుకున్న పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. బతికున్న బాధితులను కూడా చనిపోయినట్లు చిత్రకరించి వారికి నష్టపరిహారం ఇవ్వకుండా ఎగవేత చేశారని ఇది అత్యంత బాధాకరమైన విషయమని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ప్రకారం ప్రాజెక్టు కింద నిర్వాసితులుగా మారుతున్న ప్రతి ఆదివాసికి నష్టపరిహారం చెల్లించాలని, పోడు భూమి పట్టాలకు కూడా నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కొంత మందికి భూమిని చూపించి పట్టాలు ఇవ్వలేదని, మరి కొంతమందికి పట్టాలు ఇచ్చి భూములు చూపించలేదని వీటిపై ప్రజలు ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వ ఉన్నతాధికారులు కొండమొదలు ఆర్ అండ్ ఆర్ కాలనీ సందర్శించి ఇక్కడ ప్రజల సమస్యలు పరిష్కరించకపోతే దశల వారీగా ప్రజా భాగస్వామ్యంతో ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసి నాయకులు యాలగడ్డ నాగేశ్వరరావు, నడిపూడి గాంధీ, బి.రామన్న దొర, సరే గంగరాజు, అందాల అబ్బాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చెయ్యండి

**-ఆదివాసి సంక్షేమ పరిషత్**



**చింతూరు, డిసెంబర్ 5(తెలుగురాష్ట్రం విలేకరి):**
ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యాలయంలో, ముఖ్య కార్యకర్తల సమావేశం సంఘ ప్రధాన కార్యదర్శి పూనెం చిన్న విరభద్రం ఆదర్వంలో నిర్వచించారు. ఈ సందర్భంగా చిన్న వీరబద్రం మాట్లాడుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ 1990 డిసెంబర్31 కొంతమంది ఆదివాసీ విద్యార్దులు, కొంత మంది ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్(ఐఏఎస్) అధికారుల సలహాలతో ఏర్పడిందని తెలిపారు. 1990 నుండి ఇప్పటివరకు ఆదివాసీ విద్యార్డులకు విధ్య, వైద్య, ఆర్థిక రంగాలలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాఖలలో లోని 27 విభగాలలో లక్షల మందికి ఊపాది కల్పించిన ఘనత ఆదివాసీ సంక్షేమ పరిషత్ దే నని ఆయన అన్నారు. అలాగే ఈ నెల డిసెంబర్ 31న జరిగే ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు సోడే ప్రసాద్, సీనియర్ నాయకులు పైదా ముత్తయ్య, సోడే రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం అవసరం



**అనంతగిరి, డిసెంబర్ 5 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
పెదబిడ్డ జిటిడబ్ల్యుఏ బాలుర పాఠశాలలో విద్య, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన మెగా తల్లితండ్రుల సమావేశం ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పెదబిడ్డ పంచాయితీ సర్పంచ్ సాలేపు పెంటమ్మ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం అత్యంత అవసరమని తెలిపారు. ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు అందించే విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ పల్లె ప్రాంతాల పిల్లలు కూడా ఉన్నత చదువులు చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాల నిర్వహణ, మౌలిక వసతులు, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం కోసం తల్లిదండ్రుల చురుకైన పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. గ్రామ అభివృద్ధిలో విద్యకు ప్రత్యేక స్థానం ఉందని గుర్తుచేశారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడానికి ప అవసరమైన మౌలిక సదుపాయలు పాఠశాలలో ఉన్నాయని మీ పిల్లలకు పనిలో కాకుండా పాఠశాలలో పంపించాలని విద్యార్థుల తల్లి తండ్రులకు తెలిపారు. విద్యా కమిటీ చైర్మన్ జన్ని సింహాచలం మాట్లాడుతూ గ్రామ ప్రజల విద్యా చైతన్యం పెరుగుతోందని, అలాంటి సందర్భాల్లో పేరెంట్స్ మీటింగ్లు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. పిల్లల చదువులో తల్లిదండ్రుల ప్రోత్సాహం, పర్యవేక్షణ ఉంటే ఫలితాలు మరింత మెరుగవుతాయని ఆయన చెప్పారు. ఈ సంధర్బంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు శాతం, రాబోయే పరీక్షల ప్రణాళికలపై వివరాలు సమర్పించారు. తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధి, బోధన పద్ధతులు, పిల్లల ప్రవర్తన, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలపై ప్రశ్నలు అడిగి తమ అభిప్రాయాలు వెల్లడించారు. విద్య, క్రీడలు, నైపుణ్యాల అభివృద్ధి వంటి అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ సర్పంచ్ సాలేపు పెంటమ్మ, విద్య కమిటీ ఛైర్మెన్ జన్ని సింహాచలం, వైస్ ఛైర్మెన్ జన్ని లచ్చున్, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
డిసెంబర్ 06
శనివారం 2025




# 4 మ్యాచులే ఆడతా అన్నా..

## ఆ ప్లేయర్ పై రూ.10కోట్లు కుమ్మరించేందుకు కేకేఆర్ రెడీ..

**ఐపీఎల్ 2026 మినీ వేలంలో అత్యధిక డబ్బుతో అడుగుపెడుతున్న జట్లలో కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ ముందున్నాయి. కేకేఆర్ వద్ద ఏకంగా రూ.64.30 కోట్లు ఉండగా, సీఎస్కే వద్ద రూ.43.40 కోట్లు అందుబాటులో ఉన్నాయి. కేకేఆర్ ఈసారి చాలా మంది ఆటగాళ్లను విడుదల చేయడంతో, ముఖ్యంగా వికెట్ కీపర్-బ్యాటర్ స్థానంలో ఖచ్చితంగా ఒక స్టార్ ప్లేయర్‌ను కొనుగోలు చేయాల్సిన అవసరం ఏర్పడింది.**



ఐపీఎల్ 2026 మినీ వేలంలో అత్యధిక డబ్బుతో అడుగుపెడుతున్న జట్లలో కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ ముందున్నాయి. కేకేఆర్ వద్ద ఏకంగా రూ.64.30 కోట్లు ఉండగా, సీఎస్కే వద్ద రూ.43.40 కోట్లు అందుబాటులో ఉన్నాయి. కేకేఆర్ ఈసారి చాలా మంది ఆటగాళ్లను విడుదల చేయడంతో, ముఖ్యంగా వికెట్ కీపర్-బ్యాటర్ స్థానంలో ఖచ్చితంగా ఒక స్టార్ ప్లేయర్‌ను కొనుగోలు చేయాల్సిన అవసరం ఏర్పడింది. వికెట్ కీపర్లలో రహ్మానుల్లా గుర్బాజ్ వంటి ఆటగాళ్లను కూడా కేకేఆర్ విడుదల చేసింది. ఈ వేలంలో అందుబాటులో ఉన్న స్టార్ వికెట్ కీపర్లలో జోష్ ఇంగ్లిస్, క్వింటన్ డి కాక్, రహ్మానుల్లా గుర్బాజ్ మాత్రమే ఉన్నారు.

ఆస్ట్రేలియాకు చెందిన వికెట్ కీపర్-బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అతను గత ఐపీఎల్ 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తరపున 11 మ్యాచ్‌లలో 162.57 స్ట్రైక్ రేట్‌తో 278 పరుగులు చేశాడు. అయినప్పటికీ పంజాబ్ కింగ్స్ అతన్ని విడుదల చేసింది. దీనికి ప్రధాన కారణం ఏమిటంటే.. ఇంగ్లిస్ కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఐపీఎల్ 2026 సీజన్‌లో మొదటి 4 మ్యాచ్‌లు మాత్రమే ఆడగలనని పంజాబ్ కింగ్స్‌కు చెప్పాడు. గతంలో అతనిని రూ.11.5 కోట్లకు కొనుగోలు చేసినందున, కేవలం 4 మ్యాచుల కోసం ఇంత భారీ మొత్తాన్ని వెచ్చించడం సరికాదని భావించి పంజాబ్ అతన్ని వదులుకుంది.

### కేకేఆర్ మాస్టర్ ప్లాన్

పంజాబ్ కింగ్స్ వదులుకున్న ఈ కీలక ఆటగాడిని దక్కించుకోవడానికి కేకేఆర్ టీమ్ ఒక పక్కా ప్లాన్ సిద్ధం చేసింది. ఇంగ్లిస్ ఈ సీజన్‌లో కొన్ని మ్యాచ్‌లే ఆడినా, రాబోయే సీజన్లలో అతను జట్టుకు రెగ్యులర్ ఆటగాడిగా అందుబాటులో ఉంటాడు కాబట్టి, ఈ క్వాలిటీ ప్లేయర్‌ను సొంతం చేసుకోవాలని కేకేఆర్ నిర్ణయించుకుంది. ఇంగ్లిస్ లాంటి క్వాలిటీ బ్యాటర్ కోసం అన్ని జట్లు పోటీ పడే అవకాశం ఉంది. అందువల్ల, ఇతన్ని దక్కించుకోవడానికి కేకేఆర్ టీమ్ వేలంలో రూ.10 కోట్ల వరకు కేటాయించినట్లు సమాచారం. ఇంగ్లిస్ గతంలో 11 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 162.58 స్ట్రైక్ రేట్‌తో ఆడాడు. ప్రస్తుతం 30 ఏళ్లున్న ఇతను రాబోయే 4 సంవత్సరాలు అద్భుతంగా రాణించగలడని భావించి, కేకేఆర్ అతన్ని టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. బ్యాకప్‌గా డి కాక్ లేదా గుర్బాజ్‌ను కొనుగోలు చేసే అవకాశం కూడా ఉంది.

# విరాట్ దెబ్బకి నిమిషాల్లోనే హౌస్ ఫుల్ బోర్డులు

## వైజాగ్‌లో రేపటి మ్యాచ్‌కి కోహ్లీ మేనియా పీక్స్

**ప్రస్తుతం విశాఖపట్నం అంతా విరాట్ కోహ్లీ పేరుతో మారుమోగుతోంది. భారత్, సౌతాఫ్రికా మధ్య మూడు వన్డేల సిరీస్ విజేతను నిర్ణయించే చివరి కీలక మ్యాచ్ ఇక్కడే జరగనుంది. మ్యాచ్ దగ్గర పడుతున్న కొద్దీ నగరంలో కోహ్లీ క్రేజ్ అమాంతం పెరిగింది. పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే.. మొదట్లో ఎవరూ కొనడానికి ఆసక్తి చూపని టికెట్లు, ఇప్పుడు నిమిషాల వ్యవధిలోనే సోల్డ్ అవుట్ అయ్యాయి.**




ప్రస్తుతం విశాఖపట్నం అంతా విరాట్ కోహ్లీ పేరుతో మారుమోగుతోంది. భారత్, సౌతాఫ్రికా మధ్య మూడు వన్డేల సిరీస్ విజేతను నిర్ణయించే చివరి కీలక మ్యాచ్ ఇక్కడే జరగనుంది. మ్యాచ్ దగ్గర పడుతున్న కొద్దీ నగరంలో కోహ్లీ క్రేజ్ అమాంతం పెరిగింది. పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే.. మొదట్లో ఎవరూ కొనడానికి ఆసక్తి చూపని టికెట్లు, ఇప్పుడు నిమిషాల వ్యవధిలోనే సోల్డ్ అవుట్ అయ్యాయి. ఈ అసాధారణమైన డిమాండ్‌కు కారణం విరాట్ కోహ్లీ ఇటీవల రాంచీ, రాయ్‌పూర్‌లో ఆడిన వన్డేలలో వరుసగా రెండు సెంచరీలు కొట్టడమే. ఆయన ఫామ్ చూసి వైజాగ్‌లో కూడా మరో సెంచరీ చూడాలని అభిమానులు ఉవ్విళ్లూరుతున్నారు.

### టికెట్ల అమ్మకంలో అనూహ్య మార్పు

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నవంబర్ 28న మూడో వన్డే టికెట్లను ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టినప్పుడు, అభిమానుల నుంచి స్పందన కరువైంది. దీంతో ఈసారి మ్యాచ్‌కు తక్కువ మంది వస్తారని భావించిన అధికారులు, కౌంటర్లలో కూడా టికెట్లు అమ్మేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ విరాట్ కోహ్లీ వరుసగా రెండు సెంచరీలు బాదడంతో మొత్తం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మీడియా, ఆపరేషన్స్ టీమ్ సభ్యుడు వై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కోహ్లీ సెంచరీల తర్వాత టికెట్ల రెండో, మూడో దశ అమ్మకాలు నిమిషాల్లోనే పూర్తయ్యాయి. గతంలో ఎవరూ కొనడానికి సిద్ధపడని టికెట్లకు ఇప్పుడు డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది.

### ఎయిర్‌పోర్టులోనూ ఉప్పొంగిన ఉత్సాహం

క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం కేవలం ఆన్‌లైన్ టికెట్లకే పరిమితం కాలేదు. భారత జట్టు విశాఖపట్నం చేరుకోవడానికి ముందే, ఎయిర్‌పోర్టు వద్ద భారీగా జనం గుమిగూడారు. ఫ్లైట్ ఆలస్యమైనప్పటికీ, అభిమానులు గంటల తరబడి నిరీక్షించారు. విరాట్ కోహ్లీ, ఇతర ఆటగాళ్లు బయటకు రాగానే, ఎయిర్‌పోర్ట్ మొత్తం చప్పట్లు, కేకలతో మార్మోగిపోయింది. రాయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో కూడా ఇలాంటి ఆసక్తికరమైన దృశ్యం కనిపించింది. విమానం ఆలస్యం కావడంతో విమానయాన సిబ్బందిపై కోపంగా ఉన్న ప్రయాణీకులు, టీమిండియాను చూడగానే ఒక్కసారిగా ప్రశాంతంగా, సంతోషంగా మారిపోయారు. విరాట్‌ను చూడగానే అందరూ మొబైల్ కెమెరాలు ఆన్ చేసి ఉత్సాహంగా కనిపించారు. డిసెంబర్ 6న జరిగే ఈ చివరి వన్డేలో విరాట్ మరో సెంచరీ చేసి, టీమిండియాకు సిరీస్ అందించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# వైభవ్ సూర్యవంశీ VS అర్జున్ టెండూల్కర్..

### వామ్మో, ఐపీఎల్ జీతంలో ఇంత తేడానా.. పైచేయి ఎవరిదో తెలుసా?





వైభవ్ సూర్యవంశీ, అర్జున్ టెండూల్కర్ ఇప్పుడు ఐపీఎల్‌లో ఒకరినొకరు ఎదుర్కోవచ్చు. సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్ జట్టులో భాగం. అర్జున్ టెండూల్కర్ ఈసారి లక్నో సూపర్ జెయింట్స్ తరపున ఆడతాడు, లక్నో నుంచి ముంబై ఇండియన్స్‌కు మారాడు. అయితే, ఇద్దరు ఆటగాళ్ల ఐపీఎల్ జీతాలలో గణనీయమైన వ్యత్యాసం ఉంది.

ఇటీవల సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీ సందర్భంగా వైభవ్ సూర్యవంశీ, అర్జున్ టెండూల్కర్ ప్రత్యర్థులుగా పోటీ పడ్డారు. ఇప్పుడు, ఈ ఆటగాళ్ళు %ఖూా% 2026 సమయంలో మళ్ళీ తలపడవచ్చు. ఈ ఇద్దరు ఆటగాళ్ల %ఖూా% జీతాలలో గణనీయమైన తేడా ఉంది. వైభవ్ సూర్యవంశీ, అర్జున్ టెండూల్కర్ అనే ఇద్దరు యువ భారత ఆటగాళ్ళు ఎల్లప్పుడూ వార్తల్లో ఉంటారు. ఇటీవల, సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీలో జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో వీరి మధ్య ఘర్షణ జరిగింది. ఇది అందరి దృష్టిని ఆకర్షించింది. అర్జున్ టెండూల్కర్ జట్టు గోవా ఆ మ్యాచ్‌లో గెలిచింది.


వైభవ్ సూర్యవంశీ జట్టు ఓటమి పాలై ఉండవచ్చు. కానీ, అతను తనదైన ముద్ర వేయగలిగాడు. వైభవ్ సూర్యవంశీ 25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో సహా 46 పరుగులు చేశాడు. అదే సమయంలో అర్జున్ టెండూల్కర్ 4 ఓవర్లలో 32 పరుగులకు రెండు వికెట్లు పడగొట్టాడు. అయితే, అర్జున్ బ్యాట్స్‌మన్‌గా కేవలం ఐదు పరుగులు మాత్రమే చేయగలిగాడు.

వైభవ్ సూర్యవంశీ, అర్జున్ టెండూల్కర్ ఇప్పుడు ఐపీఎల్‌లో ఒకరినొకరు ఎదుర్కోవచ్చు. సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్ జట్టులో భాగం. అర్జున్ టెండూల్కర్ ఈసారి లక్నో సూపర్ జెయింట్స్ తరపున ఆడతాడు, లక్నో నుంచి ముంబై ఇండియన్స్‌కు మారాడు. అయితే, ఇద్దరు ఆటగాళ్ల ఐపీఎల్ జీతాలలో గణనీయమైన వ్యత్యాసం ఉంది.

IPL 2025 కి ముందు జరిగిన వేలంలో వైభవ్ సూర్యవంశీని రాజస్థాన్ రాయల్స్ సొంతం చేసుకుంది. రూ. 30 లక్షల బేస్ ధరతో, వైభవ్ సూర్యవంశీని రాజస్థాన్ రాయల్స్ రూ. 1.10 కోట్లకు వేలంలో వేసింది. %ఖూా% 2026 కోసం కూడా అతన్ని నిలుపుకుంది. అంటే ఈ %ఖూా% సీజన్‌లో కూడా అతనికి రూ. 1.10 కోట్ల జీతం లభిస్తుంది.

భారత దిగ్గజ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్, IPL 2025 కోసం ముంబై ఇండియన్స్ నుంచి రూ.30 లక్షల జీతం అందుకున్నాడు. అతని ప్రస్తుత ఫీజుకు లక్నో సూపర్ జెయింట్స్ అతనిని మార్పిడి చేసుకుంది. అంటే లక్నో సూపర్ జెయింట్స్ కూడా IPL 2026 కోసం అతనికి రూ. 30 లక్షలు చెల్లిస్తుంది.

# ప్రపంచ రికార్డునే భయపెట్టిన ఎస్ఆర్‌హెచ్ మాజీ ప్లేయర్..



గబ్బాలో జరిగిన యాషెస్ టెస్ట్‌లో మిచెల్ స్టార్క్ పాకిస్తాన్ ఆటగాడు వసీం అక్రమ్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. స్టార్క్ 415 టెస్ట్ వికెట్లతో ఎడమచేతి వాటం పేసర్లలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. జో రూట్ అజేయ సెంచరీతో ఈ మ్యాచ్‌లో తొలి రోజు ఇంగ్లాండ్ 325/9 పరుగులు చేసింది. స్టార్క్ 6 వికెట్లు తీసి మెరిశాడు. బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండో యాషెస్ టెస్ట్ మ్యాచ్ తొలి రోజు ఆట ముగిసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ రోజు ఆట ముగిసే సమయానికి 9 వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ తరఫున జో రూట్ అజేయ సెంచరీ సాధించగా, ఆస్ట్రేలియా తరఫున మిచెల్ స్టార్క్ 6 వికెట్లు పడగొట్టాడు. గబ్బాలో జరుగుతున్న ఈ పింక్ బాల్ టెస్ట్‌లో మొదటి ఓవర్ నుంచే ఇంగ్లాండ్ జట్టును ఇబ్బంది పెట్టడం ప్రారంభించిన స్టార్క్, రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లు పడగొట్టి జట్టుకు అత్యంత విజయవంతమైన బౌలర్‌గా నిలిచాడు. దీనితో, స్టార్క్ పాకిస్తాన్ మాజీ కెప్టెన్ వసీం అక్రమ్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. నిజానికి, టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఎడమచేతి వాటం పేసర్ల జాబితాలో పాకిస్తాన్ మాజీ కెప్టెన్ వసీం అక్రమ్ అగ్రస్థానంలో ఉన్నాడు. అక్రమ్ 104 మ్యాచ్‌ల్లో 23.62 సగటుతో 414 వికెట్లు పడగొట్టాడు. ఇప్పుడు మిచెల్ స్టార్క్ టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఎడమచేతి వాటం పేసర్‌గా అక్రమ్‌ను అధిగమించాడు. మిచెల్ స్టార్క్ తన టెస్ట్ కెరీర్‌లో కేవలం 102వ మ్యాచ్‌లోనే వసీం అక్రమ్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. హ్యారీ బ్రూక్‌ను తన 415వ టెస్ట్ వికెట్‌గా అవుట్ చేయడం ద్వారా అక్రమ్ రికార్డును బద్దలు కొట్టాడు. స్టార్క్ 102 మ్యాచ్‌ల్లో 26.51 సగటుతో 415 వికెట్లు పడగొట్టాడు. టెస్ట్ క్రికెట్‌లో 400 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన ఎడమచేతి వాటం పేసర్లు స్టార్క్, అక్రమ్ మాత్రమే. వారిలో మూడవ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ శ్రీలంకకు చెందిన చమిందా వాస్, అతను 111 మ్యాచ్‌ల్లో 355 వికెట్లు తీసుకున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన ట్రెంట్ బౌల్ట్ 78 టెస్టుల్లో 317 వికెట్లు పడగొట్టగా, భారతదేశానికి చెందిన జహీర్ ఖాన్ 92 టెస్టుల్లో 311 వికెట్లు పడగొట్టాడు. గబ్బా టెస్టులో వసీం అక్రమ్ రికార్డును బద్దలు కొట్టడం ద్వారా, మిచెల్ స్టార్క్ నంబర్ వన్ ఎడమచేతి వాటం పేసర్‌గా మారడమే కాకుండా, వార్న్, మెక్‌గ్రాత్ తర్వాత గబ్బాలో ఆడిన టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన మూడవ ఆస్ట్రేలియన్‌గా కూడా నిలిచాడు. ఈ విషయంలో అతను నాథన్ లియాన్‌ను అధిగమించాడు.

# 2027 ప్రపంచకప్ నా చేతులతో ఎత్తుడు ఫిక్స్.. పంత్‌కు చెప్పేసిన రోహిత్

**2023 ప్రపంచ కప్‌ను కెప్టెన్‌గా గెలిపించే అవకాశాన్ని రోహిత్ తృటిలో కోల్పోయాడు. ఎందుకంటే, అప్పటి వరకు టోర్నమెంట్‌లో అజేయంగా నిలిచిన భారత్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. అయితే, వచ్చే ప్రపంచకప్‌లో మాత్రం ట్రోఫీ ఎత్తాలని రోహిత్ శర్మ ఫిక్స్ అయ్యాడు.**

రాయ్‌పూర్ వేదికగా భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటు చేసుకుంది. మైదానంలో ఆటగాళ్ల మధ్య జరిగే సరదా సంభాషణలు తరచుగా వైరల్ అవుతుంటాయి. తాజాగా భారత కెప్టెన్ రోహిత్ శర్మ, వికెట్ కీపర్ రిషబ్ పంత్ మధ్య జరిగిన ఒక హృదయపూర్వక సంఘటన నెట్టింట సందడి చేస్తోంది.

### రోహిత్ కంటి రెప్ప ఊడితే..

మ్యాచ్ సమయంలో రోహిత్ శర్మ పక్కన నిల్చున్న రిషబ్ పంత్, రోహిత్ కంటి రెప్ప ఒకటి ఊడి ముఖంపై పడి ఉండటాన్ని గమనించాడు. వెంటనే ఆ రెప్పను తీసి, రోహిత్ చేతిపై పెట్టి "ఏదైనా కోరిక కోరుకో భయ్యా" అని చెప్పినట్లు వీడియోలో కనిపిస్తోంది. చిన్న పిల్లల్లా వీరిద్దరూ చేసిన ఈ పని కెమెరాలకు చిక్కడంతో అభిమానులు ముచ్చటపడుతున్నారు.

ఈ వీడియోపై స్పందించిన భారత మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్, రోహిత్ మనసులో ఏముందో వెల్లడించారు. "రోహిత్‌కు




ప్రధానంగా రెండు కోరికలు ఉన్నాయి. ఒకటి, 2027 వన్డే ప్రపంచ కప్‌ను తన చేతులతో ఎత్తడం. మరొకటి, రాబోయే మ్యాచ్‌లో సెంచరీ చేయడం" అని అభిషేక్ నాయర్ స్టార్ స్పోర్ట్స్ కార్యక్రమంలో పేర్కొన్నారు.

### వరల్డ్ కప్ లక్ష్యంగా..

2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్లో ఓటమి తర్వాత, 2024లో టీ20 ప్రపంచ కప్ గెలిచి రోహిత్ పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అతని ప్రధాన లక్ష్యం 2027 వన్డే ప్రపంచ కప్ గెలవడమేనని ఈ సంఘటన ద్వారా మరోసారి స్పష్టమైంది.

ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ అవుతోంది. రోహిత్ శర్మ 2027 వరల్డ్ కప్ గెలవాలన్న కోరిక నెరవేరాలని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

# ఓటీటీకి వచ్చేసిన హడలెత్తించే ప్రేతాత్మ కథ!

ప్రణవ్ మోహన్ లాల్ హీరోగా 'డీయస్ ఈరే'
హారర్ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన సినిమా
83 కోట్లు వసూలు చేసిన కంటెంట్
ఈ రోజు నుంచే మొదలైన స్ట్రీమింగ్
ఐదు భాషల్లో అందుబాటులో



ంలయాళంలో మోహన్ లాల్ సూపర్ స్టార్ గా కొనసాగుతున్నారు. ఆయన తనయుడు ప్రణవ్ మోహన్ లాల్ హీరోగా ఎంట్రీ ఇచ్చి చాలా కాలమే అవుతోంది. తెలుగు ప్రేక్షకులకు మాత్రం ఇంతవరకూ ఆయన చేరువ కాలేదనే చెప్పాలి. అయితే ఇప్పుడు ఆయన తెలుగు ఆడియన్స్ కి కూడా దగ్గరయ్యే సమయం వచ్చేసింది. ఎందుకంటే మలయాళంలో ఆయన సూపర్ హిట్ అందుకున్న ఒక సినిమా ఇప్పుడు తెలుగులోను ఓటీటీకి వచ్చేసింది. ఆ సినిమా పేరే 'డీయస్ ఈరే'. ప్రణవ్ మోహన్ లాల్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా, అక్టోబర్ 31వ తేదీన థియేటర్లకు వచ్చింది. రాహుల్ సదాశివన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, 6 రోజులలోనే 50 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఆ తరువాత చాలా వేగంగా 80 కోట్ల మార్క్ ను టచ్ చేసింది. ఈ ఏడాదిలో అత్యధిక వసూళ్లను రాబట్టిన మలయాళ సినిమాలలో 4వ స్థానంలో నిలిచింది. అలాంటి ఈ సినిమా ఈ రోజునే 'జియో హాట్ స్టార్' లో స్ట్రీమింగ్ కి వచ్చింది. మలయాళంతో పాటు తెలుగు .. తమిళ .. కన్నడ .. హిందీ భాషల్లో అందుబాటులో ఉంది. కథ విషయానికి వస్తే, ఈ సినిమా హీరో పేరు రోహన్. శ్రీమంతుల కుటుంబానికి చెందిన యువకుడు. చాలా విలాసవంతమైన జీవితాన్ని గడుపుతుంటాడు. తల్లిదండ్రులు విదేశాలకి వెళ్లడం వలన ఒంటరిగా ఉంటాడు. తన క్లాస్ మేట్ 'కణి' ఆత్మహత్య చేసుకుందని తెలిసి, ఆమె పేరెంట్స్ ను పలకరించడానికి వెళతాడు. అక్కడ ఏం జరుగుతుంది? అక్కడి నుంచి తిరిగి వచ్చిన తరువాత ఏమౌతుంది? అనేది కథ. ఓటీటీ వైపు నుంచి కూడా ఈ సినిమాకి ఒక రేంజ్ లో రెస్పాన్స్ వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.




# 'త్వరలోనే సమస్య పరిష్కారమవుతుంది'

విడుదలకి సిద్ధమైన బాలకృష్ణ నటించిన 'అఖండ-2' చిత్రం చివరి నిమిషంలో వాయిదా పడడం తెలిసిందే. తాజాగా దీనిపై చిత్ర నిర్మాత డి.సురేష్ బాబు స్పందించారు. 'త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుంది. ప్రతి ఒక్కరూ ఈ సినిమా రిలీజ్ కాకపోవడానికి ఏవేవో కారణాలు చెబుతున్నారు. అవి అన్నీ అనవసర ప్రస్తావనలు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమై సినిమాని విడుదల చేస్తాం. అభిమానులు నిరాశ చెందకండి. అంచనాలని మించి ఈ చిత్రం ఉండబోతుంది. ఆర్థిక అడ్డంకులు మాత్రమే సినిమా ఆలస్యానికి కారణమయ్యాయి' అని చెప్పారు.



# 'దిల్‌వాలే దుల్హానియా లే జాయేంగే'కి అరుదైన గౌరవం

షారుఖ్, కాజోల్ జంటగా నటించిన 'దిల్‌వాలే దుల్హానియా లే జాయేంగే' చిత్రం విడుదలై ఇటీవల 30 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఈ చిత్రానికి అరుదైన గౌరవం లభించింది. ఈ సినిమాలోని ప్రధాన పాత్రలైన రాజ్ (షారుఖ్ ఖాన్), సిమ్రాన్ (కాజోల్) కాంస్య విగ్రహాన్ని లండన్‌లోని ప్రఖ్యాత లీసెస్టర్ స్క్వేర్లో ఆవిష్కరించారు. ఈ వేడుకకి ముఖ్య అతిథులుగా వచ్చిన షారుఖ్, కాజోల్ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. లండన్‌లోని 'సీన్స్ ఇన్ ది స్క్వేర్' ట్రైల్‌లో చోటు దక్కించుకున్న మొట్టమొదటి చిత్రంగా ఇది నిలిచింది.

# చంద్రబాబు బయోపిక్‌లో నటిస్తా : శివరాజ్‌కుమార్

'మంచి దర్శకుడు దొరికి చంద్రబాబు బయోపిక్‌తో వస్తే ఆయన పాత్రలో నటించటానికి నేను సిద్ధంగా ఉన్నా. ప్రస్తుతం రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'పెద్ది'లో కీలకపాత్రలో ఉన్నా. కమ్యూనిస్టు నాయకుడు గుమ్మడి నర్సయ్య ఏ విధంగా ప్రజలకు సేవలు అందించారనేది ప్రపంచానికి తెలుసు. ఆయన బయోపిక్‌లో నేను కథానాయకుడిని. శనివారంనాడు ఈ సినిమా షఉటింగ్ తెలంగాణాలోని పాల్వంచలో ప్రారంభం కానుంది. కన్నడలో మాదిరిగానే తెలుగు ప్రజలు కూడా నన్ను ఆదరిస్తారనే నమ్మకం ఉంది. గుమ్మడి నర్సయ్య కథను దర్శకుడు చెప్పిన వెంటనే నటిస్తానని ఒప్పుకున్నా. ఆయన సేవలను ప్రపంచానికి తెలియ జేయటానికి ఈ సినిమా దోహదపడుతుంది' అని కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ అన్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రిలోని దుర్గమ్మ ఆలయంలో ఆయన శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ అధికారులు స్వాగతం పలికారు.



# కుటుంబ కథా చిత్రం 'శంబాల' : ఆది



'సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో ఎన్నో చిత్రాలు వచ్చాయి. వాటిన్నంటికీ భిన్నంగా ఈ 'శంబాల' సినిమా ఉంటుంది. అన్ని తరగతుల ప్రేక్షకులకు ఖచ్చితంగా నచ్చుతుంది. అన్ని ఎలిమెంట్లను టచ్‌చేస్తూ ఈ సినిమాలోని అంశాలను మేళవించాం. పూర్తి గ్రామీణ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. సంగీత దర్శకుడు చరణ్ పాకాల ఇచ్చిన మంచి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ పేక్షకులను బాగా ఆకట్టుకుంటుంది. ఒక మిస్టరీ థ్రిల్లర్‌గా ఉండి 1980లో ఒక గ్రామంలో జరిగే కొన్ని సంఘటనల చుట్టూ కథ తిరుగుతూ ఉంటుంది. కథానాయిక అర్చన పాత్ర సినిమాకే హైలెట్‌గా నిలుస్తుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు విశేషమైన స్పందన లభిస్తోంది. సినిమా మొత్తం సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలోనే సాగుతుంది' అని కథానాయకుడు ఆది అన్నారు. హైదరాబాద్, విజయవాడలో ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆది, అర్చన జోడీగా తెరకెక్కిన సినిమా 'శంబాల'. ఈనెల 25న థియేటర్లలో విడుదల కానుంది. చిత్ర యూనిట్ తెలుగు రాష్ట్రాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాల్లో నటుడు శివతోపాటుగా చిత్ర యూనిట్ ప్రతినిధులంతా పాల్గొన్నారు.

# దేవుడితో గొడవ...

## ఆసక్తికర అంశాలు వెల్లడించిన భాగ్యశ్రీ భోర్సే

యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తన వ్యక్తిగత విశ్వాసాలు, దైవచింతనకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. చిన్నతనంలో తనకు ఏదైనా కష్టం వస్తే దేవుడినే తన తండ్రిగా భావించి ఆయనతో పోట్లాడేదాన్నని, కానీ ఇప్పుడు ఆ దేవుడి నిర్ణయాలనే పూర్తిగా విశ్వసిస్తున్నానని తెలిపారు. శుక్రవారం నాడు ఓ ఆలయంలో ప్రశాంతంగా ఉన్న వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పోస్ట్ చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. "నాకు గుర్తుంది.. చిన్నప్పుడు జీవితంలో ఎలాంటి కష్టం వచ్చినా నేను చేసే మొదటి పని దేవుడితో గొడవపడటమే. ఆయనే నా తండ్రి అన్నట్లు ప్రతీసారి ప్రశ్నించేదాన్ని. కానీ ఇప్పుడు నేను ఓ దశకు చేరుకున్నాను. నాకేది మంచిదో ఆయనకు కచ్చితంగా తెలుసని ఇప్పుడు నేను నమ్ముతున్నాను" అని తన పోస్టులో ఆమె రాసుకొచ్చారు. ప్రస్తుతం ఆమె కెరీర్ పరంగా మంచి విజయాలు అందుకుంటున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇటీవల భాగ్యశ్రీ నటించిన 'కాంత', 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రాల్లో ఆమె నటనకు విమర్శకుల నుంచి, ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో వచ్చిన పీరియడ్ డ్రామా 'కాంత'లో ఆమె పోషించిన కుమారి పాత్రకు విశేషమైన స్పందన లభించింది. ఈ సినిమా విజయంపై ఆమె మాట్లాడుతూ, కష్టపడితే కచ్చితంగా మంచి ఫలితాలు వస్తాయని తాను నమ్ముతున్నట్లు తెలిపారు. నటుడు రానా దగ్గుబాటిని తన గురువుగా అభివర్ణిస్తూ, "మొదటి రోజు నుంచి నాకు మద్దతుగా నిలిచిన రానాకు ధన్యవాదాలు. మీరు నిజమైన స్నేహితుడు, మంచి వ్యక్తి. ఈ ప్రయాణంలో మీరు నా గురువుగా ఉండటం నా అదృష్టం. మీ మార్గదర్శకత్వం లేకపోతే నేను ఇది చేయగలిగేదాన్ని కాదు" అని తెలిపారు. ఇక తన సహనటుడు దుల్కర్ సల్మాన్‌ను ప్రశంసిస్తూ, "ప్రియమైన దుల్కర్, మీరు నిజమైన 'నడిప్పు చక్రవర్తి'. మీ పక్కన నటించడం గొప్ప అనుభూతి. ప్రతీ ఫ్రేమ్‌లో మీరు అద్భుతంగా కనిపించారు. నటుడిగా మా అందరికీ మీరు ఒక స్ఫూర్తి" అని ఆమె పోస్టులో పేర్కొన్నారు.



# ఆ కిరీటంతోనే నా జీవితం మారింది: ఐశ్వర్యారాయ్

ప్రముఖ నటి ఐశ్వర్యారాయ్ బచ్చన్ ఇటీవల రెడ్ సీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె తన కెరీర్ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. 1994లో మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకోవడమే తన జీవితాన్ని పూర్తిగా మార్చేసిందని ఆమె అన్నారు. బ్లాక్ అండ్ వైట్ డ్రెస్‌లో ఐశ్వర్య ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వేదికపై ఐశ్వర్య మాట్లాడుతూ, 1994లో తాను అనుకోకుండానే మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్నానని తెలిపారు. దానిని కేవలం అందాల పోటీగా భావించలేదని, అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశంగా చూశానని వెల్లడించారు. ఆ రోజుల్లో మన దేశం గురించి చాలా తక్కువ మందికి తెలుసనే విషయం తనను ఆశ్చర్యపరిచిందని, అందుకే అక్కడ మన దేశ గొప్పతనాన్ని వివరించానని తెలిపారు. ఆ టైటిల్ గెలిచిన తర్వాత తన జీవితం కీలక మలుపు తీసుకుందని ఐశ్వర్య అన్నారు. "విశ్వసుందరిగా గెలిచాక, ప్రముఖ దర్శకుడు మణిరత్నం గారి 'ఇరువర్' సినిమాతో తెరంగేట్రం చేశాను. అదే ఏడాది బాలీవుడ్ నుంచి కూడా అవకాశాలు వచ్చాయి. నా కెరీర్‌లో 'దేవదాస్' ఒక మైలురాయి లాంటిది. ఆ సినిమా తర్వాత కథల ఎంపికపై నాకు పూర్తి స్పష్టత వచ్చింది" అని వివరించారు. తనను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఐశ్వర్యారాయ్ చివరిసారిగా మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియిన్ సెల్వన్ 2'లో కనిపించారు.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339